# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం 8 ఫిబ్రవరి 2026


## జిల్లాస్థాయి పరుగు పందెం పోటీకి యువకుడి ఎంపిక



**బుగ్గారం,ఫిబ్రవరి 7(నినాదం):**
బుగ్గారం మండలం శేకల్ల గ్రామానికి చెందిన దొనకొండ అజయ్ అనే యువకుడు 100 మీటర్ల పరుగు పందెంలో జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. చిన్ననాటి నుండి ఆటలలో అభిరుచి ఎక్కువగా ఉండడం వల్ల పట్టుదలతో జిల్లా స్థాయి పరుగు పందెంలో ఎంపికయ్యారని అజయ్ తల్లిదండ్రులు తెలిపారు. శనివారం నాడు పరుగుపందంలో ఎంపికైన అజయ్ ని గ్రామ సర్పంచ్ పర్స రమేష్ సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువత మొబైల్ ఫోన్, ఆల్కహాల్ మద్యం లాంటి వ్యసనాలకు అలవాటు పడకుండా ఆటల పట్ల అభిరుచి పెంచుకుంటే ఆరోగ్యంగా ఉంటారని అదేవిధంగా మానసిక అభివృద్ధికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు వార్డు సభ్యులు నంది తిరుపతి తదితరులు ఉన్నారు

## పోస్టల్ బ్యాలెట్ కేంద్ర ఏర్పాట్ల పరిశీలన...




**మెట్‌పల్లి, ఫిబ్రవరి 7: (నినాదం):**
మున్సిపల్ కమిషనర్ టీ. మోహన్ శనివారం మున్సిపల్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగ కేంద్ర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను ఫిబ్రవరి 8, 2026 తేదీన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెట్‌పల్లి మెప్మా భవనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్ రావు, ఆర్వో అజ్మతుల్లా బేగ్, టీపీఓ రాజేంద్రప్రసాద్, టీఎంసీ సోమిడి శివ, ముజీబ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తిపాక దొంగల బీభత్సం



**ధర్మారం ఫిబ్రవరి 7 (నినాదం):**
మండలంలోని పత్తిపాక గ్రామంలో నిన్న రాత్రి దొంగలు బీభత్సవం సృష్టించారు. వివరాలలోకి వెళితే అదే గ్రామానికి చెందిన మెన్నెని వెంకట నర్సింగ రావు నిన్న సాయంత్రం తన ఇంటికి తాళం వేసి వెళ్ళాడు, ఈ రోజు ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఎవరో గుర్తు తెలియని దొంగలు అతని ఇంటి తాళం పగులగొట్టి, లోపల బీరువా తెరిచి ఉన్నది. మరియు అందులో గల శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి గుడికి సంబంధించిన దాదాపు 19 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు 510 గ్రాముల వెండి వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని నిర్ధారించుకున్న ఇంటి యజమాని వెంటనే ఎస్సై ప్రవీణ్ కుమార్ కు సమాచారం అందించగా ఆయన క్లూస్ టీమ్ ను రంగంలోకిదించి ఆధారాలు సేకరించాడు. ఇంటి యజమాని నరసింగరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై తెలిపాడు.

## శివరాత్రి జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన కొప్పుల



**ధర్మారం ఫిబ్రవరి 7 (నినాదం):**
మండలం రచ్చపల్లి గ్రామంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ సాంబమూర్తి దేవాలయం లో 10.వ తేదీ నుండి 15.వ తేదీ వరకు జరిగే జాతర మహోత్సవానికి హాజరు కావాల్సింది గా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం జాతర సంబంధించిన వాల్ పోస్టర్స్ ను మాజీమంత్రి ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో సాంబమూర్తి దేవాలయం రచ్చపల్లి ఆలయ కమిటీ చైర్మన్ పెర్క రవీందర్ కమిటీ సభ్యులు చింతల తిరుపతి, ఉప సర్పంచ్ భైరి సురేష్, మాజీ ఎంపీటీసీ బెల్లల రోజారాణి - లక్ష్మణ్, వార్డ్ సభ్యులు తాళ్ల రాజయ్య బెల్లాల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురంలో అమ్మ రమాబాయి 128వ జయంతి వేడుకలు



**అశ్వాపురం, ఫిబ్రవరి 7 (నినాదం ):**
మాల జన సమితి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ సతీమణి అమ్మ రమాబాయి 128వ జయంతి వేడుకలను అశ్వాపురం, కాల్వబజార్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల జన సమితి నాయకులు చెట్టి సురేష్ మాట్లాడుతూ, అమ్మ రమాబాయి చేసిన త్యాగాలు అపూర్వమని అన్నారు. ఆమె జీవితం దళితులకు స్ఫూర్తిదాయకమని, అసమానతలతో నిండిన సమాజ మార్పు కోసం తన కుటుంబాన్నే త్యాగం చేసిన మహాతల్లి అని కొనియాడారు. రమాబాయి అంబేద్కర్ దేశమంతా ఎప్పటికీ రుణపడి ఉండాల్సిన త్యాగమూర్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూపల్లి ధ్రువ కుమార్, సిద్ధి విలాసం కుమారి, జూపెల్లి దేవ శివరాజ్, చెట్టి కమల కుమారి, శ్రేయాన్వి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం మాతా శిశు ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 07.( నినాదం ):**
ప్రభుత్వ మాతా, శిశు ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని మాతా, శిశు ఆసుపత్రిని ఆమె ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌పేషంట్, ఔట్‌పేషంట్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, రక్తపరీక్షల గది, స్కానింగ్ కేంద్రం, టీకాల గది, చిన్నారులకు పాలిచ్చే గది, మందుల గది, మరుగుదొడ్లు తదితర విభాగాలను పరిశీలించారు. పలు రిజిస్టర్లను తనిఖీ చేసి, అన్ని విభాగాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అవసరమైన టీకాలు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నపిల్లల వైద్య విభాగాన్ని పరిశీలించి, నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు త్రాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. చికిత్సల కోసం వచ్చిన మహిళలతో మాట్లాడిన కలెక్టర్, ఆసుపత్రి లో అందుతున్న వైద్య సేవలపై వాకబు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలతో మెరుగైన వైద్యం అందుతుందని భరోసా కల్పించారు. పార్కింగ్ సమస్యలు లేకుండా చూడాలని, భద్రతా బందోబస్తు పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్ఎంఓ రమేష్, విభాగాధిపతి సరోజ, ప్రోగ్రాం ఆఫీసర్ సౌమ్య, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి, తహసిల్దార్ రాజు, వైద్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అశ్వాపురంలో హత్య కేసు నమోదు



అశ్వాపురం, ఫిబ్రవరి 7 (నినాదం):
అశ్వాపురం గ్రామంలోని చవిటి గూడెంకు చెందిన బాతిక సత్యవతి (భర్త: శ్రీను లేటు), వయసు 45 సంవత్సరాలు, యాదవ కులానికి చెందిన గృహిణి. ఆమె రెండవ కుమారుడు బాతిక విజయ్ (25) గత రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయకుండా ఖాళీగా తిరుగుతూ, కుటుంబ సభ్యులతో పాటు స్థానికులతో తరచూ గొడవలు పడుతూ ఉండేవాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో బాతిక విజయ్ అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి, మళ్లీ మద్యం తాగడానికి తన తల్లి వద్ద రూ.300లు అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వలేదని ఆమెతో గొడవపడి, ఆమెను కొట్టాడని తెలిపారు. ఈ ఘటనను గమనించిన అతని పెద్ద అన్న బాతిక అరుణ్ కుమార్, “అమ్మను ఎందుకు కొడుతున్నావు?” అంటూ విజయ్‌ను నిలదీశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, అరుణ్ కుమార్ సమీపంలో ఉన్న మంచం కోడు (కర్ర) తీసుకొని విజయ్ కుడి కాలిపై మరియు ఎడమ కంటి రెప్ప పై భాగంలో బలంగా కొట్టాడు. దీంతో విజయ్‌కు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. తక్షణమే కుటుంబ సభ్యులు విజయ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడి వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. మణుగూరు ఆసుపత్రిలో వైద్యులు పరీక్షించి విజయ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తల్లి బాతిక సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వాపురం ఎస్సై రాజేష్ హత్య నేరంగా కేసు నమోదు చేశారు. తదుపరి ఏడూళ్ల బయ్యారం సీఐ వేల్పుల వెంకటేశ్వరరావు సంఘటనపై దర్యాప్తు ప్రారంభించారు

## జీపీఎస్ పాఠశాలల్లో ఐటిడిఏ పీఓ రాహుల్ ఆకస్మిక తనిఖీ



**అశ్వాపురం, ఫిబ్రవరి 7 (నినాదం):**
మండల పరిధిలోని భీమవరం, గొందిగూడెం గ్రామపంచాయతీల్లో ఉన్న జీపీఎస్ పాఠశాలలను శనివారం భద్రాచలం ఐటిడిఏ పీఓ బి. రాహుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల చదువులో ప్రతిభను తెలుసుకునేందుకు బోర్డుపై రాయించి, పాఠ్యపుస్తకాలు చదివించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత పాటించాలని వర్కర్లకు సూచించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల చదువు, క్రీడలపై మరింత దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పాయం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు బి. రఘుబాబులను అభినందించారు.

## సీఎం పర్యటనకు భారీ బందోబస్తు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**
భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కొడవటాంచ ఆలయం భూపాలపల్లి సభ ప్రాంగణం వద్ద 1100 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తు పర్యవేక్షణలో భాగంగా 10 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు ఎస్ఐలు పాల్గొంటున్నారు. భద్రతా చర్యలను జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సమన్వయం చేస్తున్నారు. అదనంగా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, రోప్ పార్టీ ప్రత్యేకంగా మోహరించాయి. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా అమలు చేస్తుండగా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, విధించిన సూచనలు పాటించాలని కోరుతున్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి




**కల్వకుర్తి, ఫిబ్రవరి 7 (నినాదం) :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కల్వకుర్తి మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ వెంకటరెడ్డి, సిఐ నాగార్జున, ఎస్ఐ మాధవ రెడ్డి లతో కలిసి శనివారం పరిశీలించారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అందులో 20 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా, మిగతా 24 పోలింగ్ కేంద్రాలను నార్మల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి, సమస్యత్మకమైన పోలింగ్ కేంద్రాలను సందర్శించాడం జరిగింది. డిఎస్పి మాట్లాడుతూ సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో శాంతిభద్రతలు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్సై కి సూచించారు. ప్రతి ఓటర్ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

## క్రమశిక్షణ, ఫిట్నెస్ పోలీస్ శాఖకు మూలాధారం



**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 07.( నినాదం):**
ఈ రోజు నిర్మల్ జిల్లా పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు జిల్లాలోని సివిల్, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్, సిబ్బందికి వీక్లీ పరేడ్, జిల్లా ఎస్పీ ఆదేశానుసారం నిర్వహించడం జరిగింది. సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్ ప్రదర్శనని ఎస్పీ పరిశీలించారు. వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి, ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి బాగా ఉపయోగపడుతుందని, సమయం దొరికినప్పుడు సిబ్బంది అధికారులు వ్యాయామం చేయడం అనేది చాలా ముఖ్యం అని, మంచి శక్తి సామర్థ్యాలతో ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా విధులు నిర్వహించడానికి మంచి అవకాశం ఉంటుంది. ఫిట్నెస్ ను అనునిత్యం కాపాడుకోవాలన్నారు. పోలీసులు మంచి జీవన విధానాన్ని అవలంబించాలన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలను నిర్వర్తించాలని జిల్లాకు, తెలంగాణ పోలీస్ శాఖకి మంచిపేరు తీసుకురావాలన్నారు. సిబ్బందికి చేయవలసిన విధులు ,చేయకూడని పనుల గురించి పలు సూచనలు చేయడం జరిగింది. ఏదైనా వ్యక్తి గత సమస్యలు ఉన్న, డ్యూటీల వద్ద సమస్య ఉన్న, ఆరోగ్య సమస్య ఉన్న ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలన్నారు. చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటు పడి, విధులలో నిర్లక్ష్యం వహించి పోలీస్ శాఖ ప్రతిష్టకి భంగం కలిగించే విధంగా ప్రవర్తించరాదని హెచ్చరించారు. మరియు రెగ్యులర్ గా హెల్త్ చెక్ అప్స్ చేయించుకోవాలన్నారు. వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. మరియు సమయం దొరికినప్పుడు కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని, క్రమశిక్షణతో కూడిన విధులు నిర్వహించాలని తెలిపారు. సైబర్ నేరాలు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్ ఆడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. సర్వీసుకు సంబంధించిన మరియు వ్యక్తిగతమైన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ పరేడ్ లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి (అడ్మిన్) నిర్మల్ ఏఎస్పీ సాయికిరణ్ ఐపీఎస్,ఇన్స్పెక్టర్లు నైలు , కృష్ణ, గోవర్ధన్ రెడ్డి,రవీంద్ర నాయక్,గోవర్ధన్ రెడ్డి, సమ్మయ్య, రిజర్వ్ఇన్స్పెక్టర్లు శేఖర్,రమేష్, రామక్రిష్ణ, ఎస్ఐ లు, ఆర్.ఎస్.ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

**-కల్వకుర్తి టియుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు జహీర్**

**కల్వకుర్తి, ఫిబ్రవరి 07 (నినాదం) :**
అనుమతులు లేకుండ బ్లాస్టింగ్ నిర్వహించిన ఘటన స్థలానికి న్యూస్ కవరేజ్ కై వెళ్ళిన జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించి దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి టీయుడబ్ల్యూజే ఐజేయు అధ్యక్షుడు జహీర్ అన్నారు. ఈ నెల 06 తేదీన కల్వకుర్తి మండలం పరిధిలోని జీడిపల్లి గ్రామంలో వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టులపై గ్రామ సర్పంచి తో పాటు వారి బంధువు జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించి, బూతులు తిడుతూ, బెదిరింపులకు పాల్పడడం జరిగింది. అట్టి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి మండల టీయూడబ్ల్యూజే ఐజేయు డిమాండ్ చేస్తు వారిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. జర్నలిస్ట యాక్టు ప్రకారం జర్నలిస్టులకు ఆటంకం కలిగించి దురుసుగా ప్రవర్తించిన వ్యక్తులను కఠినంగా శిక్షించి, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని సిఐ,ఎస్ఐ లను కోరారు.

## తొట్టిపంపు అంగన్వాడీ సెంటర్‌లో వ్యాక్సినేషన్



**దమ్మపేట, ఫిబ్రవరి 7(నినాదం):**
మండల కేంద్రంలోని తొట్టిపంపు అంగన్వాడి సెంటర్లో స్థానిక సర్పంచ్ సోయం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది శనివారం అంగన్వాడీ సెంటర్ పిల్లలకు వ్యాక్సినేషన్ చేశారు. అనంతరం గర్భిణీలకు గుడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు వైద్య సిబ్బంది సూచనలు మేరకు పౌష్టికమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పౌష్టికాహారాన్ని నేరుగా అంగన్వాడి కేంద్రానికి వచ్చి భుజించాలని ఆమె తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహార ప్యాకెట్లను ఇంటికి తీసుకెళ్లి ప్రతిరోజు వాడాలని సూచించారు. ఆరోగ్య విషయంలో తగు జాగర్తలు పాటించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కొమరం వెంకటమ్మ, ఆశా వర్కర్ కట్టం రామలక్ష్మి, అంగన్వాడీ టీచర్ పద్మ, గర్భిణీలు బాలింతలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శివ పార్వతుల కల్యాణం



**కమలాపూర్ ఫిబ్రవరి 7 (నినాదం):**
మండల కేంద్రం లోని శ్రీ భవాని సహిత రామలింగేశ్వర స్వామి దేవాలయ 7వ, వార్షికోత్సవం సందర్భంగా కమలాపూర్ మాజీ ఎంపీటీసీలు బాలసాని రమేష్-లత దంపతులు శనివారం శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఆవునూరి మఠం శివకుమార్, బాలసాని రమాదేవి శ్రీనివాస్, బాలసాని కళ్యాణి దేవేందర్ దంపతులు భక్తులుపాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ దరఖాస్తుల స్వీకరణ

**నిర్మల్ ప్రతినిధి, ఫిబ్రవరి 07.( నినాదం):**
జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కార్డుల జారీ కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో అక్రిడిటేషన్ మాడ్యూల్‌తో కూడిన వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. 2026-28 సంవత్సరాలకు గాను అక్రిడిటేషన్ కార్డుల జారీ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ నెల 28వ తేదీతో ముగియనుందని, అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయబడతాయని పేర్కొన్నారు. మీడియా యాజమాన్యాలు తమ ప్రతినిధుల పేర్లను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఆ జాబితాలో ఉన్న అభ్యర్థులు https://ipr.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 9వ తేదీ నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం, ఫిబ్రవరి 8 , 2026

# సాహితీ లహరి

*సాహిత్యం కేవలం అక్షర విన్యాసం కాదు; అది ఒక సామాజిక అవసరం. "సహితస్య భావ: సాహిత్యం" అన్నట్లుగా, సమాజానికి మేలు చేసే ఆలోచనల సమాహారమే సాహిత్యం. భారతీయ అలంకార శాస్త్రవేత్తలు సాహిత్య ప్రయోజనాన్ని అద్భుతంగా వివరించారు. ఆచార్య మమ్మటుడు తన కావ్యప్రకాశంలో" కావ్యం యశసే/ అర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యఃపరనిర్వృతయే/కాంతాసమ్మితతయోపదేశయుజే||" అని పేర్కొన్నాడు. అంటే కావ్యం వల్ల కీర్తి, ధనం, లోక వ్యవహార జ్ఞానం కలుగుతాయి. అమంగళం తొలగిపోతుంది (శివేతరక్షతయే). అన్నిటికంటే ముఖ్యంగా, ప్రియురాలు చెప్పినట్లుగా హితవును బోధించే 'కాంతాసమ్మిత' ఉపదేశం లభిస్తుంది. మానవుడిని సంస్కరించి, ఉన్నతుడిగా తీర్చిదిద్దడమే సాహిత్య ప్రధాన ప్రయోజనం. అది అంతా దార్ల మాట శతకంలో కనిపిస్తుంది.*

## పౌరాణిక దృష్టాంతాల ద్వారా విలువలు ప్రబోధిస్తున్న
# దార్ల మాట శతకం

ఈ క్రమంలో తెలుగు సాహిత్యంలో 'శతకం' ఒక శక్తివంతమైన సాధనంగా నిలిచింది. పండితుల నుండి పామరుల వరకు అందరినీ ప్రభావితం చేయగలిగే ప్రక్రియ ఇది. భర్తృహరి తన సుభాషిత త్రిశతి (నీతి శతకం)లో:"సాహిత్య సంగీత కళా విహీనః సాక్షాత్ పశుః పుచ్ఛవిషాణహీనః ||"అని పేర్కొన్నాడు. అంటే సాహిత్యం, సంగీతం, కళల పట్ల అవగాహన లేని మనిషి తోక, కొమ్ములు లేని సాక్షాత్ పశువు వంటివాడు. అలాగే హితోపదేశంలో కూడా "ధర్మేణ హీనాః పశుభిః సమానాః" అని చెప్పబడింది. అంటే ఆహార నిద్రా, భయ మైథునాలు పశువులకు, మనుషులకు సమానమైనప్పటికీ, మనిషిని వివేకవంతుడిగా మార్చే 'నీతి' లేదా 'ధర్మం' లేనివాడు పశువుతో సమానం. ఈ ప్రాచీన నైతిక సూత్రాలనే వర్తమాన కాలానికి అన్వయిస్తూ, నిత్య జీవితంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్లో మనిషి ఏ మార్గంలో నడవాలో బోధించే బాధ్యతను తెలుగు శతక కవులు స్వీకరించారు. వేమన, సుమతీ వంటి ప్రాచీన శతకాలు తెలుగువారి నైతిక జీవితాన్ని శతాబ్దాలుగా శాసిస్తూనే ఉన్నాయి. అయితే, నేటి గ్లోబలైజేషన్ కాలంలో మానవీయ విలువలు అడుగంటుతున్నాయి. సాంకేతికత పెరిగినా సంస్కారం తగ్గుతున్న తరుణంలో, వర్తమాన సామాజిక స్థితిగతులకు అనుగుణంగా కొత్త నీతిని ప్రబోధించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ శూన్యాన్ని పూరిస్తూ, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు తనదైన శైలిలో 'దార్ల మాట' (తేటగీతి) నీతి శతకాన్ని అందించారు. ప్రాచీన విలువలను ఆధునిక జీవనశైలికి అన్వయిస్తూ, సరళమైన భాషలో సమాజానికి ఒక కొత్త దిశానిర్దేశం చేసిన ఈ శతకంపై లోతైన అధ్యయనం నేటి తరం విద్యార్థులకు ఎంతో అవసరం. 2021లో వెలువడిన 'దారి పూలతోట దార్ల మాట' (ఆటవెలది) తర్వాత వచ్చిన ఈ తేటగీతి శతకం, 'దారి చూపించునట్టిది దార్ల మాట' అనే మకుటంతో పాఠకుల అంతఃశ్చేతనను మేల్కొల్పుతోంది.

**పౌరాణిక గాథలతో కుటుంబ విలువల బోధన:**

ఈ శతకంలో తల్లిదండ్రుల సేవతో పాటు, 'మంచి మిత్రుడు' ఎలా ఉండాలి అనే విషయానికి పురాణాలలోని శ్రీకృష్ణ-కుచేల సఖ్యాన్ని , 'ధర్మం' విజయానికి ఎలా దారి తీస్తుందో చెప్పడానికి మహాభారత నేపథ్యాన్ని కవి అద్భుతంగా వాడుకున్నారు. కుటుంబంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ఆ వంశానికే వన్నె తెస్తుంది.

*''వంశ గౌరవ మన్నది వాక్కు తోడ*
*సత్య మెప్పుడు వీడక సాగ వలయు*
*మాట తప్పని వానికి మన్న నబ్బు*
*దారి చూపించు నట్టిది దార్ల మాట''*

ఇది రామాయణంలోని శ్రీరాముని (క్రీ.పూ. 5000 ఏళ్ల క్రితం) 'ఏక వాక్య' పరిపాలనకు నిదర్శనం. ఇచ్చిన మాట కోసం రాజ్యాన్ని త్యాగం చేయడం వల్ల ఇక్ష్వాకు వంశం చరిత్రలో అమరమైంది. కుటుంబంలో సభ్యులు ఒకరికొకరు నమ్మకంగా, సత్యంతో ఉన్నప్పుడే ఆ వంశం గౌరవించబడుతుందనే పౌరాణిక సత్యాన్ని కవి ఎంతో బలంగా మనసులో నాటుకుపోయేలా చెప్పారు.

**మాతృత్వం - త్యాగశీలత :**

మూర్తిమత్వ వికాసంలో మాతృప్రేమ ఒక గొప్ప సంస్కార పరిమళాన్ని ఈ శతకంలోని కొన్ని పద్యాలలో చూడవచ్చు.

*''ఆకలిని తీర్చు తల్లిని ఆదు కొనగ*
*ఆమె త్యాగము మరువని హృదయ మదియె*
*ప్రేమ పంచెడి మాతయే దైవ మౌను*
*దారి చూపించు నట్టిది దార్ల మాట''*

ఇది భాగవతంలోని శ్రీకృష్ణుని (క్రీ.పూ. 3100 ప్రాంతం) మాతృభక్తిని స్ఫురింపజేస్తుంది. విశ్వమంతా తన నోటిలో ఉన్నా, తల్లి యశోదకు బిడ్డగా లోబడి ఉండటం ఆయన గొప్పతనం. తల్లిని దైవంగా భావించే సంస్కారమే మనిషిని చరిత్రలో మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దుతుందనే భావోద్వేగ సత్యాన్ని కవి ఇక్కడ ఆవిష్కరించారు.

**కుటుంబ అనుబంధాలు - నైతిక విశ్లేషణ**

తల్లి, తండ్రి, అన్నయ్య, తమ్ముడు, సోదరి, భార్య వంటి కుటుంబ సంబంధాలను ఈ శతకంలో చక్కని దృష్టాంతాలతో వివరించడం ఒక విశేషం.

*నవ మాసములు మోసి నడక నేర్పి*
*ఆకలిని తీర్చు తల్లిని ఆదు కోవ*
*ప్రేమ పంచెడి మాతయే దైవ మనగ*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

ఇది భాగవతంలోని శ్రీకృష్ణుని (క్రీ.పూ. 3102 ప్రాంతం) మాతృభక్తిని స్ఫురింపజేస్తుంది. విశ్వరూపాన్ని చూపిన పరమాత్మ కూడా యశోదమ్మ ప్రేమకు కట్టుబడినట్లు, మనిషికి తన తల్లిని మించిన దైవం లేదని ఈ పద్యం బోధిస్తుంది.

*కష్ట పడి నిన్ను పెంచెడి కన్న తండ్రి*
*వంశ గౌరవ మెప్పుడు నిలుప జూచు*
*తండ్రి మాటను మరువని తనయు డొప్పు*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

రామాయణంలోని శ్రీరాముడు (త్రేతాయుగం) తండ్రి మాట కోసం రాజ్యాన్ని తృణప్రాయంగా వదిలి అడవులకు వెళ్ళిన చారిత్రక సత్యాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. తండ్రి ఆశయాలను గౌరవించడమే బిడ్డల ప్రథమ కర్తవ్యం.

*తండ్రి వలె నిన్ను సాకెడి త్యాగ శీలి*
*అన్న అండగ నున్న చో భయము లేదు*
*అన్న అడుగుల జాడల నడువ వలయు*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

భారతంలో ధర్మరాజు అడుగుజాడల్లో నడిచిన భీమార్జున నకుల సహదేవుల అనుబంధం ఇక్కడ స్మరణీయం. అన్నను తండ్రిగా భావించే సంస్కారం కుటుంబ సౌభాగ్యానికి మూలం.

*కష్ట కాలాన తోడుగ కలిసి నిలుచు*
*అన్న మాటకు విలువను ఆదరించు*
*తమ్ము డన్నను ప్రాణము తనయు డనగ*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

రామాయణంలో లక్ష్మణుని (క్రీ.పూ. 5000 ఏళ్ల క్రితం) నిస్వార్థ సేవ ఇక్కడ అద్భుత దృష్టాంతం. అన్న సుఖం కోసం తన సుఖాన్ని వదిలిన తమ్ముడున్న ఇల్లు నందనవనమవుతుంది.

*అమ్మ వలె నీకు మమతను పంచ గలుగు*
*ఆడ పడుచును గౌరవ పరచ వలయు*
*అక్క చెల్లెలి దీవెన అండ యగును*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*


ఇది భారతంలోని సుభద్ర పట్ల కృష్ణార్జునులు చూపిన గౌరవాన్ని గుర్తు చేస్తుంది. సోదరిని ఆదరించే చోట సంస్కారం పరిమళిస్తుంది.


*సుఖము కష్టము సమముగ జూచు నామె*
*భార్య గౌరవ మున్న చో భాగ్య మబ్బె*
*సతిని గౌరవ ముంచిన శాంతి కలుగు*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

అరణ్య వాసంలోనూ శ్రీరాముని వెన్నంటి నిలిచిన సీతమ్మ ఆదర్శం ఇక్కడ కనిపిస్తుంది. భార్యను అర్ధాంగిగా గౌరవించే కుటుంబమే ఆర్థికంగా, సామాజికంగా వృద్ధి చెందుతుంది.

*మంచి గుణముల బిడ్డలు వంశ జ్యోతి*
*చదువు నేర్చిన బిడ్డలే సంపద యిల*
*వినయ మున్నచో బిడ్డల గెలుపు నిశ్చయము*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

లోక కళ్యాణం కోసం తండ్రిని ఎదిరించి నిలిచిన ప్రహ్లాదుని (క్రీ.పూ. పురాణ కాలం) జ్ఞాన వైరాగ్యాలు ఇక్కడ స్ఫూర్తిదాయకం. సంతానానికి ఆస్తి కంటే సంస్కారాన్ని ఇవ్వడం ముఖ్యం.



*కలిసి మెలిసియు నున్న చో బలము కలుగు*
*విడిచి పోయిన కష్టము కలుగు నెపుడు*
*ఐక్య మత్యమే లోకాన గొప్ప శక్తి*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

ప్రపంచ యుద్ధాల కాలంలో (1914-1945) ఐక్యత లేని రాజ్యాలు ఎలా కూలిపోయాయో చరిత్ర చెబుతుంది. విభజన వినాశనానికి, ఐక్యత వికాసానికి దారి తీస్తుందని ఈ పద్యం హెచ్చరిస్తుంది.

*నమ్మకమ్మే గద మరి నవని యందు*
*మోస మెన్నడు జేయక మొనసి బ్రతుకు*
*నిజము పల్కెడి వానికె నిశ్చయముగ*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

సత్యం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన హరిశ్చంద్రుని (త్రేతా యుగం) చరిత్ర ఇక్కడ గొప్ప దృష్టాంతం. కుటుంబ సభ్యుల మధ్య నమ్మకమే అసలైన పునాది.

*ప్రేమ పంచెడి మనసులే పృథివి యందు*
*శాంతి మార్గము వీడక సాగ వలయు*
*ధర్మ మెప్పుడు రక్షించు ధరను నిలచి*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

ఇది మహాత్మా గాంధీ (1869-1948) అహింసా సిద్ధాంతాన్ని, ధర్మో రక్షతి రక్షితః అనే పురాణ సూక్తిని మేళవిస్తుంది. ద్వేషం కంటే ప్రేమ శక్తివంతమైనదని, అదే కుటుంబానికి, లోకానికి క్షేమమని ఈ పద్యం సిద్ధాంతీకరిస్తుంది.

**నిస్వార్థ స్నేహం - శ్రీకృష్ణ, కుచేల అనుబంధం:**

*మంచి మిత్రుడి లక్షణాన్ని వివరిస్తూ కవి ఒక పద్యాన్ని ఇలా మలిచారు:*

*ఆప దందున ఆదుకొను నట్టి వాడె*
*మంచి మిత్రుడు జగతిని మరువ వలదు*
*అద్ద మట్లుగ నిజమును నాడ వలయు*
*దారి చూపించు నట్టిది దార్లమాట.*

భాగవత పురాణంలో శ్రీకృష్ణుడు ద్వారకాధీశుడై ఉండి కూడా, దారిద్ర్యంలో ఉన్న తన బాల్య మిత్రుడు కుచేలుడిని ఆలింగనం చేసుకుని ఆదరిస్తాడు. ఏమీ ఆశించకుండానే మిత్రుడి కష్టాలను తీరుస్తాడు. కవి ఈ పద్యంలో అదే స్ఫూర్తిని పంచుతున్నారు. ధనం, హోదా ఉన్నప్పుడు వచ్చే స్నేహితుల కంటే, ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలబడేవాడే 'నిజమైన మిత్రుడు' అని చెప్పడం ద్వారా శ్రీకృష్ణుని స్నేహ ధర్మాన్ని ఇక్కడ స్ఫురింపజేశారు.

**ధర్మో రక్షతి రక్షితః - భారతీయ ధర్మ సూత్రం:**

ధర్మం, సత్యం యొక్క శక్తిని వివరిస్తూ కవి ఇలా వర్ణించారు.

*ధర్మ మెప్పుడు రక్షించు ధరణి నిలచి*
*న్యాయ మార్గము వీడక నడవ వలయు*
*సత్య నిరతియే మనిషికి శక్తి యగును*
*దారి చూపించు నట్టిది దార్లమాట.*

"ధర్మో రక్షతి రక్షితః" అనే సుప్రసిద్ధ పౌరాణిక సూత్రం స్పష్టంగా కనిపిస్తుంది. మహాభారత యుద్ధంలో పాండవులు ధర్మ పక్షాన నిలిచారు కాబట్టే, భగవంతుని అండతో విజయం సాధించారు. అధర్మం తాత్కాలికంగా గెలిచినట్లు కనిపించినా, అంతిమంగా ధర్మమే లోకాన్ని కాపాడుతుందనే సనాతన సత్యాన్ని కవి ఇక్కడ నొక్కి చెప్పారు. సత్యమే హరిశ్చంద్రుడికి, ధర్మరాజుకు ఏ విధంగా శక్తిని ఇచ్చిందో, నేటి సామాన్యుడికి కూడా అదే శక్తినవుతుందని కవి విశ్లేషించారు.

**గురుశిష్య సంబంధం - గురుదేవోభవ:**

గురువు ప్రాముఖ్యతను వివరిస్తూ కవి చెప్పిన పద్యంలో గురు బ్రహ్మ తత్త్వం ధ్వనిస్తుంది.

*గురువు నేర్పిన విద్యయే గురుతు నిలుచు*
*జ్ఞాన దీపము వెలిగించు నవని యందు*
*గురుని దీవన నున్న చో గెలుపు నిశ్చయము*
*దారి చూపించు నట్టిది దార్లమాట.*

పురాణాల్లో ద్రోణాచార్యుడు, వశిష్ఠుడు వంటి గురువుల మార్గదర్శకత్వంలో శిష్యులు ఏ విధంగా అజేయులయ్యారో మనకు తెలుసు. "ఆచార్య దేవోభవ" అనే ఉపనిషత్ వాక్యాన్ని కవి ఇక్కడ పద్య రూపంలో పునరుద్ధరించారు. గురువు కేవలం అక్షరాలు నేర్పేవాడు కాదు, హృదయంలో జ్ఞాన దీపాన్ని వెలిగించే 'సంస్కార ప్రదాత' అని వర్ణించడం ద్వారా భారతీయ సాంస్కృతిక మరియు పౌరాణిక వారసత్వాన్ని కవి చాటి చెప్పారు.

సాంఘికీకరణ ప్రక్రియలో కుటుంబం, పాఠశాల, కళాశాల, విశ్వ విద్యాలయం ... అత్యంత ముఖ్యమైనవి. ఇక్కడ ఏర్పడిన పునాదులే ఆ వ్యక్తిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దడంలో సహకరిస్తుంది. ఇక్కడ పెరిగిన విధానమే సమాజంలో కనిపిస్తుంది. ఈ విషయాలను ఈ శతకంలో ఎంతో సాధికారికంగా వర్ణించారు కవి. వీరుడిగా తీర్చిదిద్దడం ఇక్కడ గొప్ప సామాజిక దృష్టాంతం.

**బాల్యం - పాఠశాల క్రమశిక్షణ (Formal Schooling):**

అక్షర జ్ఞానంతో పాటు సామాజిక మర్యాదలను నేర్చుకునే దశ ఇది.

*బడిని నేర్చిన విలువలె బ్రతుకు బాట*
*పుస్తకమ్ముల జ్ఞానము పుడమి రక్ష*
*వినయ మున్న చో విద్యయు విల్లసిలును*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

ప్రాచీన గురుకులాల్లో విద్యార్థులు సమిధలు సేకరించడం నుండి వేదాధ్యయనం వరకు చేసేవారు. "వినయమున్నచో విద్యయు విలసిలును" అనడంలో 'విద్యా దదాతి వినయం' అనే సంస్కృత సూక్తిని కవి ఇక్కడ సాంఘికీకరణకు పునాదిగా మార్చారు.

**కౌమారం - కళాశాల లక్ష్యశుద్ధి (Skill and Focus):**

ఈ దశలో విద్యార్థి తన మూర్తిమత్వాన్ని బాహ్య ప్రపంచం నుండి కాపాడుకుంటూ లక్ష్యం వైపు సాగాలి.

*తనదు రూపము తానును తలవ వలయు*
*వేష భాషల వింతలు వెలయ వలదు*
*అచ్చ తనమున బ్రతుకగ అంద మబ్బు*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

మహాభారతంలో కర్ణుడు తన మిత్రుడు దుర్యోధనుడి కోసం తప్పుడు దారిలో వెళ్ళడం వల్ల పతనమయ్యాడు. కానీ అర్జునుడు లక్ష్యశుద్ధితో ఉన్నత విద్యను సాధించాడు. కళాశాల దశలో స్నేహం అనేది వ్యక్తిని నిర్మించవచ్చు లేదా పతనం చేయవచ్చు. అందుకే "చెడును వీడి మంచిని చేరవలయు" అని కవి ఇక్కడ విద్యార్థులను హెచ్చరించారు.

**యవ్వనం - విశ్వవిద్యాలయ వివేకం (Higher Wisdom):**

విశ్వవిద్యాలయ స్థాయికి వచ్చేసరికి కేవలం మార్కులు మాత్రమే కాదు, సమాజాన్ని మార్చే ఆలోచనలు రావాలి.

*శాస్త్ర జ్ఞానము పెరిగిన చాల దనగ*
*మానవత్వపు విలువలె మనిషి కందము*
*లోక రీతిని దెలిసిన లోక జ్ఞాని*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

చారిత్రక మేధావి డా. బి.ఆర్. అంబేద్కర్ (1891-1956) ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో చదివినా, తన జ్ఞానాన్ని సమాజంలోని అట్టడుగు వర్గాల విముక్తి కోసం వాడారు. ఉన్నత విద్య అభ్యసించే వ్యక్తి కేవలం మేధావిగానే కాదు, 'మానవత్వపు విలువలు' కలిగిన పౌరుడిగా నిలబడాలని కవి ఇక్కడ సిద్ధాంతీకరించారు.

**పరిణతి - సమాజంలో ఉత్తమ పౌరుడు (The Ideal Citizen):**

చివరకు అన్ని దశలు దాటిన వ్యక్తి సమాజానికి ప్రతిఫలంగా ఏమి ఇస్తున్నాడనేదే ముఖ్యం.

*నలుగురైనను మెచ్చగ నడుప వలయు*
*మంచి వాడును లోకాన వెలయ వలయు*
*ధర్మ మెప్పుడు రక్షించు ధరణి నిలచి*
*దారి చూపించు నట్టిది దార్ల మాట.*

ఇది మహాత్మా గాంధీ (1869-1948) జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఆయన పొందిన విద్య, ఎదుర్కొన్న అనుభవాలు చివరకు ఆయనను ఒక 'మహాత్ముడిగా' సమాజానికి అర్పించాయి. "నలుగురు మెచ్చడం" అంటే వ్యక్తి సామాజిక బాధ్యతను (Social Responsibility) నెరవేర్చడమే. సారాంశంగా చెప్పాలంటే, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారి 'దార్ల మాట' శతకం కేవలం ప్రాచీన నీతులను వల్లెవేసే పుస్తకంగా చూడలేం; అది ఆధునిక మానవుడిని సంస్కరించే ఒక 'మానవీయ మ్యానిఫెస్టో'గా కనిపిస్తుంది. సాంఘికీకరణ ప్రక్రియలో కుటుంబం వేసిన సంస్కార పునాది నుండి, విశ్వవిద్యాలయం ప్రసాదించిన వివేకం వరకు, మనిషి ఎలా ఒక పరిపూర్ణ మూర్తిమత్వాన్ని (Personality) సంతరించుకోవాలో కవి దీనిలో సోదాహరణంగా వివరించారు. పౌరాణిక గాథలను వర్తమాన సామాజిక సంక్షోభాలకు అన్వయించడం ద్వారా, ఈ శతకం పాఠకులకు/ విద్యార్థులకు ఒక చారిత్రక స్పృహను, నైతిక స్థైర్యాన్ని కల్పిస్తోంది. గ్లోబలైజేషన్ ఉధృతిలో కొట్టుకుపోతున్న విలువలను కాపాడుకోవడానికి 'దార్ల మాట' ఒక ఆత్మీయమైన దిక్సూచిలా నిలుస్తుంది. విద్యార్థులు, మేధావులు, సామాన్య పాఠకులు తప్పక చదవాల్సిన ఈ శతకం, తెలుగు నీతి సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలం చేసుకుంటుంది. ధర్మం వైపు నడిచే ప్రతి అడుగుకూ, నిజాయితీతో కూడిన ప్రతి బ్రతుకూ 'దారి చూపించునట్టిది దార్ల మాట' అన్న మకుటం ఒక నిరంతర ప్రేరణగా ఎంతో ఔచిత్యంతో ఉందనిపిస్తుంది.


( ఈ శతకంలోని మరికొన్ని అంశాలను మరొక వ్యాసంలో తెలుసుకుందాం)

డి. సాయినాథ్ రెడ్డి,
సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్



# కవి సార్వభౌములు - కనకాభిషేకాలు

సాహితీ చరిత్రలో ఒక కవి లేదా పండితుని ప్రతిభ, అఖండమైన పాండిత్యం, అపూర్వమైన సృజనాత్మకతకు లభించిన అత్యున్నత గౌరవం కనకాభిషేకం. ఇది కేవలం భౌతిక సన్మానం మాత్రమే కాదు, ఒక కవి శిరస్సుపై పాలకుల ఆశీస్సులు, ప్రజల మన్ననలు, అక్షరాల ఔన్నత్యానికి దక్కిన శిఖర సమానమైన గౌరవం. బంగారు నాణేలు లేదా దీనారటంకాలతో కవి శిరస్సుపై అభిషేకం చేయడం ఈ సత్కారపు అసాధారణ వైభవానికి, ఆనాటి పాలకుల ఉదార కళాపోషణకు శాశ్వత నిదర్శనం. ఈ అరుదైన గౌరవాన్ని కవిసార్వభౌముడు శ్రీనాథుని నుండి దక్షిణాంధ్ర యుగపు కవయిత్రులు, ఆధునిక కవుల వరకు అందుకుని తరించారు. తెలుగు సాహిత్యంలో ప్రబంధ యుగానికి ఆద్యుడిగా, కవిసార్వభౌమ బిరుదాంకితుడిగా వెలుగొందిన శ్రీనాథుడు (క్రీ.శ. 15వ శతాబ్దం) ఈ అపూర్వ గౌరవాన్ని పొందిన తొలి తెలుగు కవిగా ప్రసిద్ధి చెందారు. కొండవీటి రెడ్డి రాజుల వద్ద విద్యాధికారిగా పనిచేసిన శ్రీనాథుడు, విజయనగర సామ్రాజ్యాధీశుడైన ప్రౌఢ దేవరాయల (రెండవ ప్రౌఢ దేవరాయలు, క్రీ.శ. 1423-1447) ఆస్థానాన్ని సందర్శించడం ఈ చారిత్రక ఘట్టానికి నాంది. రాయల సభలో అఖండ పాండిత్యంతో ప్రసిద్ధి చెందిన గౌడ డిండిమ భట్టారకునితో ఆయన వాదోపవాదాలు జరిపి, తన అసాధారణ కవితా ప్రౌఢితో, అద్భుతమైన వాక్పటిమతో అతడిని ఓడించారు. ఈ అసాధారణ విజయానికి సంతోషించిన రాయలు, డిండిమ భట్టు పాండిత్య చిహ్నమైన కంచు ఢక్కను పగులగొట్టించి, శ్రీనాథునికి 'కవిసార్వభౌమ' బిరుదును ప్రదానం చేశారు. అంతటితో ఆగకుండా, రాయలు తన ముత్యాలశాలలో ఉన్నతమైన ఆసనంపై శ్రీనాథుణ్ణి కూర్చుండబెట్టి, ఆయన శిరస్సుపై దీనారటంకాలు (బంగారు నాణేలు) ధారలాగా పోసి కనకాభిషేకం చేశారు. ఈ మహోన్నత సన్మానాన్ని శ్రీనాథుడు స్వయంగా తన చాటు పద్యంలో: "దీనారటంకాల తీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాలశాల...పగలగొట్టించి తుద్భట వివాదప్రౌఢి గౌడ



డిండిమబట్టు కంచుఢక్క...పాదుకొల్పితి సార్వభౌమ బిరుదు" అని సగర్వంగా ప్రస్తావించారు. శ్రీనాథుడు రచించిన శృంగార నైషధం, కాశీ ఖండం, భీమేశ్వర పురాణం వంటి గ్రంథాలు ఆయన పాండిత్యానికి, తెలుగు కవిత్వానికి ఆయన జోడించిన ప్రౌఢిమకు తార్కాణాలు. తదనంతర కాలంలో, నాయక రాజుల యుగం (దక్షిణాంధ్ర యుగం, క్రీ.శ. 17వ శతాబ్దం)లో కవి పోషణ శిఖరాగ్రానికి చేరింది. తంజావూరు పాలకుడైన రఘునాథ నాయకుడు (క్రీ.శ. 1600-1634), స్వయంగా కవిగా, సంగీతజ్ఞుడిగా, ఆంధ్రభోజుడుగా కీర్తింపబడ్డాడు. రఘునాథ నాయకుడు తన బాల్యంలోనే 'పారిజాతాపహరణము'ను అత్యాశువుగా రచించినందుకు అతని తండ్రి అచ్యుతప్ప నాయకుడిచే కనకాభిషేకం పొందినట్లు యజ్ఞనారాయణ రాజచూడామణి దీక్షితులు పేర్కొన్నారు. అంతేకాక, రఘునాథ నాయకుడి ఆస్థానంలో అత్యంత గౌరవనీయ స్థానం పొందిన బహుభాషా కోవిదురాలు, అష్టావధాన పండితురాలు అయిన కవయిత్రి మధురవాణికి కూడా ఆయన కనకాభిషేకం చేశారు. ఈమె, రాజు స్వయంగా తెలుగులో రచించిన 'రఘునాథ రామాయణం'ను అత్యంత ప్రతిభావంతంగా సంస్కృత భాషలోకి 'రఘునాథ రామాయణ సారము' పేరిట అనువదించి, రాజును సంతృప్తురాలిని చేసింది. ఆమె పాండిత్య ప్రకర్షకు మెచ్చిన రఘునాథ నాయకుడు స్వర్ణ ముద్రికలతో ఆమెకు కనకాభిషేకం చేయగా, ఈ అపూర్వ సంఘటన దక్షిణాంధ్ర యుగంలో ఒక మహిళా కవయిత్రికి వైదుష్యం కారణంగా లభించిన అత్యున్నత గౌరవంగా చరిత్రలో నిలిచిపోయింది. మధురవాణి రచించిన సంస్కృత కావ్యం 'రామాయణ సార కావ్య తిలకము' తొమ్మిదవ సర్గాంత గద్యాలలో "...ప్రౌఢశ్రీరఘునాథనాయక కృతి స్వర్ణాభిషేక క్రియ"...కలదానని సగర్వంగా చెప్పుకున్నారు.


మహిళా కవయిత్రులలో కనకాభిషేక సత్కారం పొందిన మరొక ప్రముఖురాలు పసుపులేటి రంగాజమ్మ. ఈమె తంజావూరును పాలించిన నాయక రాజు, రఘునాథ నాయకుని కుమారుడు విజయరాఘవ నాయకుడి ఆస్థాన కవయిత్రిగా ఉండేవారు. రంగాజమ్మ తెలుగు సాహిత్య చరిత్రలో స్త్రీలలో మొట్టమొదటిసారిగా కనకాభిషేక సత్కారం పొందిన కవయిత్రిగా సాహిత్య చరిత్రకారులచే గుర్తింపు పొందారు. ఆమె రచించిన మన్నారు దాస విలాసము, ఉషా పరిణయము వంటి కావ్యాలు ఆమె శృంగార కవిత్వం, యక్షగాన ప్రక్రియపై ఆమెకు ఉన్న పట్టును తెలియజేస్తాయి. ఆమె తన 'ఉషాపరిణయం' గ్రంథంలోని గద్యలో, "...నీతి విద్యావిశారదయు, విజయరాఘవ మహీ/పాలవిరచిత కనకాభిషేకయు/విద్వత్కవిజన స్తవనీయవివేకయు..." అని తనను తాను సగర్వంగా వర్ణించుకున్నారు. ఈ ఉదంతాలు నాయక రాజులు కులమతాలకు అతీతంగా కేవలం వైదుష్యానికే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చేవారనే విషయాన్ని స్పష్టం చేస్తాయి. ఆ తదనంతరం, తంజావూరును జయించిన మొదటి ఏకోజీ కుమారుడు శహాజీ (క్రీ.శ.1684-1712) ఆస్థాన కవులలో ముఖ్యుడైన నివర్తి శేషాచలపతి కవి కూడా కనకాభిషేకం పొందినట్లు చారిత్రక ఆధారాల వలన తెలుస్తున్నది. శేషాచల కవి అష్టభాషా విశారదుడు, ఆంధ్రపాణిని బిరుదాంకితుడు. ఇతడు ఆంధ్ర వ్యాకరణాన్ని సంస్కృతంలో, శహరాజ విలాసము, సరస్వతీ కళ్యాణము వంటి యక్షగానాలను తెలుగులో రచించి ఆస్థానాన్ని మెప్పించారు.

మధ్యయుగాలలో రాజులచే అభినందించబడిన కనకాభిషేక సంప్రదాయం ఆధునిక కాలంలో కూడా కొనసాగింది. దీనికి నిదర్శనం శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారికి 1948 సంవత్సరంలో జరిగిన కనకాభిషేక సన్మానం. ఈ సన్మానం కేవలం రాజుల ఆస్థానంలో కాక, తెలుగు సమాజం తరపున కవులు, పండితులు, సాహితీ ప్రియుల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కవులు, పండితులు పాల్గొని, ఆయన ప్రతిభను, పాండిత్యాన్ని, 'అభినవ తిక్కన' బిరుదును కీర్తిస్తూ పద్యాలు రచించారు. ఈ సందర్భంగా ప్రచురించిన సన్మాన సంచికలో శ్రీ పూతలపట్టు శ్రీరాములు రెడ్డి గారు తుమ్మలవారి గౌరవాన్ని గత కవిరాజుల గౌరవాలతో పోలుస్తూ: "కనకాభిషేకమ్ము గాంచిన శ్రీనాథుఁ, దేనుఁగునెక్కి యూరేగ లేదు... యిన్నియును పిల్చి కవులె నీకీయ గంటి...సరస! యభినవతిక్కన బిరుదవిభవ !/తుమ్మలాన్వయ కలశాబ్ధి తుహినకరణ !" అని ప్రశంసించడం జరిగింది. ఈ సన్మానం, ఆధునిక యుగంలో కూడా తెలుగు సమాజం కవిత్వానికి, పాండిత్యానికి అత్యున్నత విలువను కొనసాగించిందని, రాజపోషణ లేకున్నా సామాజిక గౌరవం ద్వారా కవులను సత్కరించవచ్చనే సంప్రదాయాన్ని నిరూపించింది.

ఈ విధంగా, శ్రీనాథుడు, రఘునాథ నాయకుడు, మధురవాణి, పసుపులేటి రంగాజమ్మ, నివర్తి శేషాచలపతి కవి, తుమ్మల సీతారామమూర్తి చౌదరి వంటి కవిరాజులు, కవయిత్రులు తమ సాహిత్య కృషికి, పాండిత్యానికి కనకాభిషేకం వంటి అరుదైన సత్కారాలను పొంది తెలుగు సాహితీ చరిత్రలో చిరస్మరణీయమైన వైభవాన్ని సృష్టించారు. ఈ ఘట్టాలు తెలుగు కవిత్వ ఔన్నత్యాన్ని, కవుల స్థానాన్ని, కవులను, కళలను పోషించిన పాలకుల గొప్పదనాన్ని చరిత్రలో నిత్యం గుర్తుచేస్తూనే ఉంటాయి.

- డా.పోతగాని సత్యనారాయణ
9182531202

# నాన్న అక్షర ప్రబోధం



ఆటుపోట్లు జీవితాన
ఖచ్చితంగా తట్టుకుని
నిలబడాలి లోకాన
ధైర్యాన్ని కూడగట్టుకుని

పవిత్రమైన హృదయాన
భగవంతుని నిలుపుకుని
ఆధ్యాత్మిక చింతనతో
బ్రతకాలి కడు భక్తితో

చిరునవ్వులు వదనాన
సతతము పూయించుకుని
ఐకమత్యం చాటాలి
అందరినీ కలుపుకుని

చేయి చేయి కలిస్తేనే
మ్రోగుతాయి చప్పట్లు

దీపం వెలిగిస్తేనే
మాయమవుతాయి చీకట్లు

-గద్వాల సోమన్న,
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,
సెల్:9966414580

## సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం తీసుకురావాలని అనుకుంటుంది. దీనిలో వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలు మొదలైన సాహితీ పరమైన రచనలను ఆహ్వానిస్తున్నాం.
ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్ కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
ఆదివారం 8 ఫిబ్రవరి 2026


## వచ్చే నెలలో నర్మెట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

**-వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**సిద్దిపేట, ఫిబ్రవరి07(నినాదం):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో నిర్మిస్తున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని సందర్శించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల చివరిలో గాని వచ్చే నెల మొదటి వారంలో గాని రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభించేందుకు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని పరిశీలించమన్నారు.నాలుగు మెగావాట్ల కెపాసిటీ గల ఆయిల్ ఫామ్ పిప్పి తో కూడిన వ్యర్థాలతో విద్యుత్ జనరేషన్ చేసే ప్లాంట్ కూడా పూర్తవుతుందన్నారు.పనులు మొత్తం పూర్తిగా గానే ఫ్యాక్టరీ ప్రారంభించడానికి ముఖ్యమంత్రి సమయం కోరుతామన్నారు .ఫ్యాక్టరీ లోనే మూడు రోజులపాటు రైతు మేళ నిర్వహించి ఆయిల్ ఫామ్ పంటలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేసి వ్యవసాయ యాంత్రికరణ, అదునాతన వ్యవసాయ పద్ధతులపై ప్రదర్శన మరియు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులచే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.120 మెట్రిక్ టన్నుల వరకు గెలలను ప్రాసెస్ చేసే అవకాశం ఉన్న ఈ ఫ్యాక్టరీ ఉత్తర తెలంగాణ వరప్రదాయంగా మారుతుందన్నారు.ఒకటిన్నర సంవత్సరంలోనే ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేశామన్నారు.ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎలాంటి మార్కెటింగ్ ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నామన్నారు.దేశంలోనే అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఫ్యాక్టరీ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ భాష, ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా ఉద్యానవన అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, ఆయిల్ ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణా రైతులకు శాపంగా మారిన యూరియా..!

**బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్..!**



**పాలేరు ఫిబ్రవరి 07( నినాదం):**
కేంద్రం సరిపడ్డ యూరియా తెలంగాణాకు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా పట్ల అనేక ఇబందులు గురిచేస్తుందని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నేలకొండపల్లి శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం పేద రైతులను మోసం చేస్తుందని అన్నారు, యాప్ ద్వారా అనేక షరతులు పెట్టి వారి జీవితాలతో ఆదుకుంటుందని అన్నారు, యూరియా ఇప్పటికైనా సహకార సంఘాల ద్వారా ఇవ్వడం వల్ల ప్రభుత్వం, సహకార సంఘాలు బలోపేతం అవుతుందని అన్నారు, ఫర్టిలైజర్ షాపులకు అనుమతించడం వల్ల పేద రైతులకు కేంద్ర ప్రభుత్వం నిర్దిదిష్టించిన రేటు కంటే అధికంగా వసూలు చేస్తున్నారని, అధికారులు చూసి చూడనట్టు ఉంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల అగ్రహానికి గురికాక తప్పదని అన్నారు, రాష్ట్ర మంత్రివర్యులు దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన వెంకటరమణ, కొండా హర్షవర్ధన్, జెల్లా సురేష్, జోగుపర్తి నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో భారీ అగ్నిప్రమాదం

**-దట్టంగా అలముకున్న పొగతో ఉక్కిరిబిక్కిరి**

**-మంటలను ఆర్పిన ఐదు ఫైర్ ఇంజన్లు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 7(నినాదం):** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని, ఐదు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపుచేసారు. అయితే అత్యంత రద్దీగా ఉండే ఈ ఆప్రాంతంలో పక్కనే నీలోఫర్ ఆస్పత్రి కూడా ఉంది. ఆ ప్రాంతమంతా పొగలు కమ్ముకోవడంతో సహాయ చర్యలకు తీవ్ర అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక సిబ్బంది ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాంచారు. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ, ఎవరినీ ల్యాబ్ లోపలికి వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.ఃూగా.. ఉదయం 10:00 గంటల ప్రాంతంలో మొదటి ఫ్లోర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ఫ్లోర్‌లోని కంప్యూటర్లు, ఫోరెన్సిక్ సంబంధిత కెమికల్స్‌తో సహా కీలకమైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ మంటల్లో ఫోన్ ట్యాపింగ్‌కు కేసుకు సంబంధించిన హార్డ్ డిస్కులూ కాలిపోయినట్లు సమాచారం.నిమిషాల వ్యవధిలోనే మంటలు భవనంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. దీంతో లోపల ఉన్న కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టంగా నల్లటి పొగ అలుముకుంది. ప్రమాదాన్ని గమనించిన కార్యాలయ సిబ్బంది ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని ఐదు ఫైరిరజన్లతో మంటలనున అదుపులోకి తీసుకొచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, ప్రమాదం గురించి తెలియగానే నార్త్ జోన్ డీఐజీ శ్వేత, ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ల్యాబ్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# నరేంద్ర మోదీ సహకారంతోనే తెలంగాణలో మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యం

**మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్**






**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 7(నినాదం)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతోనే తెలంగాణలో మున్సిపాలిటీల అభివృద్ధి సాధ్యమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్పీయం క్రికెట్ గ్రౌండ్లో శనివారం మున్సిపల్ ఎన్నికల ప్రచార నిమిత్తం ఏర్పాటుచేసిన విజయ సంకల్ప సభలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వమే మున్సిపాలిటీలకు నిధులు ఇస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీల అభివృద్ధి కోసం రాష్ట్రం చేసిందేమీలేదన్నారు. కేవలం గ్రామాల అభివృద్ధి కాకుండా పట్టణాల అభివృద్ధి మీద ప్రత్యేక దృష్టి సారించి యుఐడిఎఫ్ 15వ ఆర్థిక సంఘం మరియు అమృత్ పథకాల కింద కేంద్రం నిధులు కేటాయిస్తుందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరచడం కోసం మరియు పారిశుద్ధ్య నిర్వహణ కోసం భారీగా నిధులు కేటాయిస్తుందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మాట్లాడుతూ తాను రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం రూ.60 కోట్ల నిధులు తీసుకువచ్చానని, పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించామని, రైల్వే అండర్ బ్రిడ్జితో పాటు ఓవర్ బ్రిడ్జిలు కూడా నిర్మిస్తున్నామన్నారు. సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఒకసారి మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులు సక్రమంగా వినియోగించుకోవడానికి కృషి చేస్తామన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో గాని, రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో గాని పట్టణంలో ఒరిగింది ఏమీ లేదని, పట్టణం వ ు ు రి కి ా ా ో ల ా తయారైందన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించి ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. అలాగే బెల్లంపల్లి నుండి గడ్చిరోలి వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కు ఎమ్మెల్యే వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించి మెమంటో అందజేశారు.ఈ విజయ సంకల్ప సభకు ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, భాజపా జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, మాజీ జిల్లా అధ్యక్షులు డా.కొత్తపల్లి శ్రీనివాస్, ప్రదీప్ రావు, మున్సిపల్ ఇంచార్జి భూమన్న, ఎస్టీ మూర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్, మాజీ జడ్పీటీసీ అరిగేలా నాగేశ్వర్ రావు, పీవీ రెడ్డి, సుహాసిని సిద్ధంశెట్టి, పట్టణ అధ్యక్షులు ఆర్మీ శివ కుమార్, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ కొండ్ర మనోహర్ గౌడ్, కో కన్వీనర్ కొప్పుల శంకర్, గజానన్ అశోక్, చిలువేరు ప్రవీణ్, అరుణ్ లోయ, ప్రశాంత్, గంగాధర్ అన్ని వార్డుల భాజపా కౌన్సిలర్ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సాహించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 7(నినాదం):**
ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ఆసక్తి చూపేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో సి ఆర్ పి లు, కృషి సఖి లకు ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధమైన వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్స హించాలన్నారు. ఆ దిశగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించాలని, ప్రకృతి సేద్యం చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలుషితమైన పంటలు పండించడం, వాటిని ఆహార రూపంలో తీసుకోవడం ద్వారా మనిషి ఆరోగ్యం క్షీణించి రోగాల బారిన పడుతున్నారన్నారు. అధిక మోతాదులో యూరియా, డి ఏ పి ల వాడకాన్ని నియంత్రించుకోవాలని, పశువుల పేడ, ఇతర సేంద్రియ ఎరువులను వినియోగించి పంట సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, సహాయ సంచాలకులు మనోహర్, మిలింద్ కుమార్, వ్యవసాయ, విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సమయంలో శాంతిభద్రతలు పాటించాలి

**కోదాడ రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి**




**కోదాడ, ఫిబ్రవరి 7 (నినాదం):**
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ కే. నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు, డి.ఎస్.పి శ్రీనివాస రెడ్డి, రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి నేతృత్వంలో కొమరబండ గ్రామంలో పోలీస్ ప్రజాభరోసా, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కళాబృందం కళాకారులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఎన్నికల ప్రాముఖ్యత, నియమావళి పాటించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో తగాదాలకు దూరంగా ఉండాలని, ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాలో ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు, పోస్టులు చేయవద్దని హెచ్చరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్సై రమేష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ రాజేష్, గ్రామ పోలీస్ అధికారి సుధీర్ కుమార్, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, సురేష్, శ్రీకాంత్, మహిళా పోలీస్ సిబ్బంది పద్మ, సుధా పాల్గొన్నారు. అలాగే పోలీస్ కళాబృందం ఇంచార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, కృష్ణ, గురులింగం, సత్యం తో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రూ. 2 కోట్ల 80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**నిర్మల ప్రతినిధి,(లోకేశ్వరం)ఫిబ్రవరి07.(నినాదం):**
లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో మహిళా సమాఖ్య సంఘ భవనాలు, అంగన్వాడి భవనాలు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు సంబంధించి మొత్తం రూ.2 కోట్ల 80 లక్షల నిధులతో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులు అబ్దుల్లాపూర్ గ్రామంలో యూ భవనం నిర్మాణం,వట్టోలి గ్రామంలో యూ భవనం నిర్మాణం,ధర్మోర గ్రామంలో రెండు అంగన్వాడి భవనాలు మరియు యూ భవనం నిర్మాణం,పంచగుడి గ్రామంలో యూ భవనం నిర్మాణం,మోడం గ్రామంలో యూ భవనం నిర్మాణం,లోకేశ్వరం మండల కేంద్రంలో యూ భవనం నిర్మాణం,గాడ్ చందా గ్రామంలో యూ భవనం నిర్మాణం,బాగపూర్ గ్రామంలో యూ భవనం నిర్మాణం,రాజుర గ్రామంలో యూ భవనం నిర్మాణం,మన్మధ్ గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ మరియు యూ భవనం నిర్మాణం, కిస్టాపూర్ గ్రామంలో జశీ భవన నిర్మాణ,పొట్‌పెల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బిలోలి గ్రామంలో యూ భవనం నిర్మాణం,సత్‌గావ్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మెరీడియన్ పాఠశాలలో శ్రీ చైతన్య ఇన్ఫినిటీ లెర్న్ అవగాహన



**సిద్దిపేట ఫిబ్రవరి 07 (నినాదం ):**మెరీడియన్ పాఠశాలలో శ్రీ చైతన్య ఇన్ఫినిటీ లెర్న్ అవగాహన సదస్సు మెరీడియన్ పాఠశాలలో శనివారం అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 225 మంది విద్యార్థులు,తల్లిదండ్రులు హాజరయ్యారు. శ్రీ చైతన్య విద్యాసంస్థల జోనల్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మార్గదర్శకత్వం చేశారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో సరైన విద్యా మార్గాన్ని ఎంపిక చేసుకునే దిశగా ఇలాంటి అవగాహన సదస్సులను పాఠశాలలో నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే ముందుగానే స్పష్టమైన లక్ష్యం అవసరమని వారు పేర్కొన్నారు.ఈ సదస్సులో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ఏ విధంగా నిర్వహించబడతాయి, జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్ తదితర కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాలను నిపుణులు విద్యార్థులకు వివరించారు. సరైన ప్రణాళికతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి, ప్రిన్సిపల్స్ రాజేందర్ రెడ్డి సౌజన్య పాల్గొన్నారు.

## మొదటి అంతస్తులో చెలరేగిన మంటలు

**-మంటల్లో కీలక పత్రాలు, కంప్యూటర్లు అగ్నికి ఆహుతి**

**-సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి వెల్లడి**

**హైదరాబాద్, ఫిబ్రవరి 7(నినాదం):** హైదరాబాద్ నగరంలోని నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్‌లో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ల్యాబ్ భవనం మొదటి అంతస్తులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కీలక పత్రాలు మంటల్లో కాలిపోయినట్లు సమాచారం. అయితే ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి.. హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పవల్లి మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. శనివారం ఉదయం 10:00 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు. 5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు. తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ఎ÷−లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు.హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా.. పాక్షికంగా కాలాయా.. అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.

## ఫోరెన్సిక్ కార్యాలయ దగ్ధంతో రుజువలన్నీ దగ్ధం

**-పలు కేసులపై తీవ్ర ప్రాభావం చూపే అవకాశం**

**-ఫైర్ ఆఫీసర్ శ్రీదాస్ క్షేత్రస్థాయి పరిశీలన**

**హైదరాబాద్,ఫిబ్రవరి 7(నినాదం):**హైదరాబాద్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ కార్యాలయంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం భారీ నష్టాన్ని మిగిల్చింది. నేర పరిశోధనలో అత్యంత కీలకమైన సాక్ష్యాధారాలను భద్రపరిచే చోట మంటలు చెలరేగడంతో, పలు కేసుల్లో సేకరించిన భౌతిక ఆధారాలు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంపై డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీదాస్ క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మీడియాతో మాట్లాడుతూ విస్తుపోయే వివరాలను వెల్లడించారు. మంటలు వ్యాపించిన తీరు, జరిగిన ఆస్తి నష్టం, కేసులపై పడే ప్రభావం గురించి ఆయన వివరించారు. ఈ అగ్నిప్రమాద తీవ్రత ఎంతలా ఉందంటే, సాక్ష్యాధారాలను భద్రపరిచిన గది మొత్తం పూర్తిగా కాలిపోయిందని శ్రీదాస్ తెలిపారు. విచారణలో ఉన్న పలు కేసులకు సంబంధించి సీజ్ చేసిన ప్రాపర్టీ మొత్తం ఈ ప్రమాదంలో ధ్వంసమైందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా డిజిటల్ సాక్ష్యాల నిధిగా భావించే సుమారు 40 నుండి 50 కంప్యూటర్లు మంటల్లో కాలిబూడిదయ్యాయి. గదిలో అత్యంత భద్రంగా స్టోర్ చేసి ఉంచిన హార్డ్ డిస్కులు కూడా మంటల ధాటికి పూర్తిగా కాలిపోయాయని, దీనివల్ల కీలకమైన డిజిటల్ డేటా శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఎలక్ట్రానిక్ వస్తువులే కాకుండా, ఆ గదిలో ఉన్న వివిధ రకాల ఎ÷−లాస్టిక్ వస్తువులు కూడా మంటలకు తోడవడంతో నష్టం తీవ్రత ఊహించని స్థాయిలో జరిగింది. ఈ దుర్ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రధాన కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. తొలుత మంటలు వ్యాపించిన సమయంలో అక్కడే ఉన్న ఎఫ్ఎస్ఎల్ సిబ్బంది తమ వద్ద ఉన్న పరికరాలతో వాటిని ఆర్పేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయితే, లోపల ఉన్న ఎలక్ట్రానిక్ విడిభాగాలు , ఎ÷−లాస్టిక్ సామగ్రి కారణంగా మంటలు ఒక్కసారిగా చెలరేగి, గది మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. దీంతో మంటలను అదుపు చేయడం సిబ్బందికి సాధ్యం కాలేదని, చూస్తుండగానే సాక్ష్యాధారాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయని ఆయన వివరించారు. దట్టమైన పొగ కారణంగా లోపలికి వెళ్లడం కూడా అగ్నిమాపక సిబ్బందికి సవాలుగా మారింది.

# నినాదం

ఆదివారం
8 ఫిబ్రవరి
2026

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం


## ఘనంగా హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ 40 వసంతాల వేడుకలు

**కళాశాల, పాఠశాల విద్యార్థులకు**
**5వ తేది నుండి 6వ తేది**
**వరకు ఆటల పోటీల నిర్వహణ**







**మల్కాజిగిరి, ఫిబ్రవరి 7 (నినాదం) :** హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ 40 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఫిబ్రవరి 5, 6, 7వ తేదీ వరకు కళాశాలలో, పాఠశాలలో ఇంటర్మీడియట్, బిఎస్సీ, బీకాం, ఎంఎస్సీ, బిఈడి హెచ్ ఐ విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. హెలెన్ కెల్లర్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలను ఫిబ్రవరి 5వ 6వ తేదీలలో ఈసిఐఎల్ క్రికెట్ గ్రౌండ్ వద్ద, 6వ, 7వ తేదీలలో భవన్స్ డిగ్రీ కాలేజీ క్రికెట్ స్పోర్ట్స్ గ్రౌండ్ లలో జూనియర్ బధిర విద్యార్థులకు కోకో, కబడ్డీ, టెన్నిస్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్, గేమ్స్ లను వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. సీనియర్స్ కు క్రికెట్ వాలీబాల్, బ్యాడ్మింటన్ ఆటలను ఆడించారు. విజేతలకు ఐబీఎం కార్పొరేట్ సంస్థ వారు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐబీఎం సీనియర్ మేనేజర్ అనిల్, హైకోర్టు సీనియర్ అడ్వకేట్ నిరంజన్, ప్రసాద్, భవాన్స్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్, హెలెన్ కిల్లర్స్ స్కూల్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ పటాన్ ఉమర్ఖాన్ లు పాల్గొన్నారు. అనంతరం ఐబీఎం కార్పొరేట్ సంస్థ వారు బహుమతులను అందజేశారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను ఈనెల 14వ తేదీన జరగబోవు 41 వ ఫౌండేషన్ సందర్భంగా అందజేస్తారని విద్యా సంస్థల అధినేత ఉమర్ ఖాన్ తెలియజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఈ చెవిటి మూగ విద్యార్థుల ప్రతిభను చూసి తన తోటి ఐబియం స్టాఫ్ వారితో ఆడుట వలన మంచి అనుభూతిని పంచుకున్నామని తెలియజేశారు. అడ్వకేట్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ స్పెషల్ విద్యార్థులలో స్పెషల్ టాలెంట్ దాగి ఉందని వారి టాలెంట్ ను వెలికి తీయాలని వారిని వికలాంగులతో కాకుండా సకలాంగులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్న ఈ హెలెన్ కెల్లర్ సంస్థ అందులో పని చేయు ఉపాధ్యాయుల కమిట్మెంట్ వర్కర్స్ ను అభినందిస్తున్నామన్నారు. భవన్ కాలేజీ ప్రిన్సిపాల్ భధిర విద్యార్థులకు కూడా అన్ని రంగాలలో ముందుండి దేశాభివృద్ధిలో తమ వంతు పాత్రను పోషించాలని అటువంటి దివ్యాంగులను చేయూతను సమాజం ప్రభుత్వం అందించాలన్నారు. బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న విజయ భాస్కర్ రెడ్డి కబడ్డీ కెప్టెన్ గాను క్రికెట్లోనూ వాలీబాల్ లోను మరియు కబడ్డీ ఆటలలో ఆల్ రౌండర్ గా నిలిచి బిఎస్సి ఏ సెల్ఫీ నార్మల్ స్టూడెంట్స్ తో ఆడి తన టీం ను గెలిపించుకొని ఈ పోటీలో హీరోగా నిలిచి అందరి ప్రశంసలను పొందాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెలెన్ కెల్లర్స్ ఇన్స్టిట్యూట్స్ సిబ్బంది డాక్టర్ ఆరుముగం, డాక్టర్ శశిదర్ రెడ్డి, ప్రొఫెసర్ అంజయ్య, శ్రీధర్, శ్రీనివాస్, శైలజ, లెనిన్ బాబు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పారమిత హెరిటేజ్‌లో అంబరాన్నంటిన ఎక్సోడస్ వీడ్కోలు సంబరాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 7(నినాదం) :** స్థానిక కరీంనగర్ లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ స్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమము ఎక్సోడస్' అనే పేరుతో నిర్వహించారు. పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా ప్రసాద్ రావు జ్యోతి ప్రజ్వలన చేసి వీడ్కోలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. సుదీర్ఘ కాలం పాటు ఒకే గొడుగు కింద పెరిగిన విద్యార్థులు, తమ పాఠశాల విద్యాభ్యాసాన్ని ముగించుకుని వెళ్తున్న తరుణంలో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ ఎదుగుదలకు తోడ్పడిన ఉపాధ్యాయ మరియు ఉపాధ్యాయేతర బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ విద్యార్థులు ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. ఉపాధ్యాయుల బోధన, వారి మార్గదర్శకత్వం తమ జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతాయని విద్యార్థులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాబోయే బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, తమ తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఉపాధ్యాయులు వారికి మార్గదర్శనం చేశారు. ఈ వీడ్కోలు వేడుక కేవలం భావోద్వేగాలతోనే కాకుండా, విద్యార్థుల కేరింతలు, నృత్యాలతో సందడిగా సాగింది. తమ సీనియర్లకు వీడ్కోలు పలుకుతూ తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా ప్రసాద్ రావు, డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, వినోద్ రావు, రాకేష్, అనూకర్ రావు, వి.యు.యం. ప్రసాద్, హన్మంత రావు, ప్రిన్సిపల్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు నాగరాజు, రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు మరణ శాసనంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై పోరాడుదాం!

**పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం.. కన్నెగారి నరసింహారెడ్డి**



**రాజేంద్రనగర్ ఫిబ్రవరి 7 నినాదం :** కార్మికులకు మరణ శాసనం గా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుకై పోరాడుదాం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాపాడుకుందాం ఫిబ్రవరి 12న దేశాక్త సమయమును జయప్రదం చేద్దామని కన్నగారి నర్సింహారెడ్డి అన్నారు. శనివారం బుద్వేల్ ప్రాంతంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను కార్మికులకు అందజేసి పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె విజయవంతం చేయండి అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లు రద్దయ్యే వరకు పోరాడండి ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కన్యగారి నర్సింహ్మారెడ్డి పిలుపు. ఈ కార్యక్రమంలో మండల ఏఐటియుసి కార్మిక సంఘం నాయకులు జి సత్యం, రామచంద్రయ్య, సాబీర్ పాండు, సుధాకర్, వాణి, మౌనిక, మునేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## రామచిలకలతోఆడుకున్నట్లుగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీనివాసుడు



**అల్వాల్, ఫిబ్రవరి 7 (నినాదం) :** ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయంలోని మూలవిరాట్ స్వామి వారు రామచిలకలతో ఆడుకుంటున్నట్లు గా భక్తులకు దర్శనమిచ్చారు. గర్భాలయంలో స్వామివారి చుట్టూ రామచిలకలను అద్భుతంగా అలంకరించిన ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణ చార్యులు. ఇలాంటి అద్భుత ఆలయాన్ని ప్రతి మనిషి ఒక్కసారైనా దర్శించుకోవాలని భక్తులు అంటున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు తులసి వెంకట రమణ చార్యులు, ఆలయ క్లర్క్ సంద్ర సుధాకర్, శ్రీవారి సేవ భక్త బృందం, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## సాధారణ ఎన్నికలపై ప్రెసీడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం





**జమ్మికుంట, ఫిబ్రవరి 7 (నినాదం) :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జమ్మికుంట ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రెసీడింగ్ అధికారులకు రెండోవ సాధారణ ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్నికలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జితేందర్ రెడ్డి, జిల్లా వ్యయ పరిశీలకులు మనోహర్ లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, మున్సిపల్ వారు మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, ఈ 2వ సాధారణ ఎన్నికలు సజావుగా పూర్తి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, రఫీ లతో పాటుపలువురు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య.



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7 (నినాదం) : వయస్సు 40-45 సం,, రాలు జగదిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లమ్మబండ అంబిర్ చెరువు (ప్రగతి నగర్ చెరువు) గట్టుపై ఉన్న చెట్టుకొమ్మకు గుర్తుతెలియని 40నుండి 45 సం వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. జీడిమెట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం 100 డయల్ కు ఫోన్ రావడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని శవాన్ని కిందికి దింపించి గాంధీ హాస్పిటల్ కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## దుండగులను అరెస్టు చేయాలి

**డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్**

దుబ్బాక, ఫిబ్రవరి 07 (నినాదం):తొలి తరం సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డిబిఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లపూర్ లో మహాత్మా జ్యోతి రావుపూలే విగ్రహన్ని మతోన్మాద శక్తులు దాడి చేసి కాళ్ళతో తన్ని అవమానించడం సిగ్గు చేటన్నారు. చత్రపతి శివాజ్ హరాజ్ చరిత్ర ను సమాజానికి చాటిన మహనీయుడు మహత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. తన బార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పి టిచర్ గా మార్చి ఆమె మహిళకు చదువు నేర్పించిన మహనేత విగ్రహం ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన వారు ముఖ్య పూలే చరిత్ర నుతెలుసుకొవాలన్నారు. ప్రభుత్వం దుండగుల పై రాజద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని శంకర్ డిమాండ్ చేశారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

**సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్**

**సిద్ధిపేట, ఫిబ్రవరి7 (నినాదం):** సిద్దిపేట పట్టణ పరిధిలోని వేములవాడ కమాన్ సమీపంలోని శ్రీ రాజరాజేశ్వరి దాబాను శనివారం మున్సిపల్ టూ టౌన్ పోలీస్ అధికారులు సంయుక్తంగా సీజ్ చేశారు. గత బుధవారం రాత్రి 09:30 గంటల సమయంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, సిద్ధిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తో కలిసి నగరంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా హనుమాన్ నగర్‌లోని రాజరాజేశ్వరి దాబాలో ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యక్తులు మద్యం సేవిస్తుండటాన్ని కమిషనర్ స్వయంగా గుర్తించారు. అదే రోజు రాత్రి దాబా యజమాని పోదేన్ల దశరథంతో పాటు మద్యం సేవిస్తున్న ఇతర వ్యక్తులపై సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగింది. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రీత్ కుమార్ టూ టౌన్ పోలీసులు కలిసి సదరు దాబాను అధికారికంగా సీజ్ చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట్ టూ టౌన్ సీఐ ఉపేందర్ మాట్లాడుతూ సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న దాబాలలో ఎవరైనా అక్రమంగా మద్యం వ్యాపారం చేసినా, సిట్టింగ్ ఏర్పాటు చేసినా లేదా బెల్ట్ షాపులు నిర్వహించినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు



## ప్రజారోగ్యంపై ఉక్కుపాదం

**క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం సహించం**
**డీఎం అండ్ హెచ్‌వో తుకారాం రాథోడ్**
**అవగాహన నుంచి అమలు వరకు పూర్తి బాధ్యత...**
**లక్ష్య సాధనలో వెనుకడుగు వద్దు**





**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి7(నినాదం):** జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాల అమలును మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ కొత్తగూడెం, భద్రాచలం డివిజన్లకు చెందిన ఎం.ఎల్.హెచ్.పిలతో ఒకటే సమగ్ర సమీక్షా సమావేశాల శ్రేణిని నిర్వహించారు. ఆరోగ్య అవగాహనతో పాటు ఫీల్డ్ స్థాయిలో పనితీరు మెరుగుపడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. కొత్తగూడెం డివిజన్ సమావేశంలో క్యాన్సర్ అవగాహన, ఎన్‌సీడీ వ్యాధులు, పిల్లల టీకాలు, మంచి అలవాట్లు, “ఈట్ రైట్” వంటి ఐఈసీ అంశాలపై ఎం.ఎల్.హెచ్.పిలకు విస్తృత అవగాహన కల్పించారు. ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా మాట్లాడేందుకు స్టేజ్ ఫియర్‌ను తొలగించుకుని ఆరోగ్య సందేశాలను సమర్థంగా అందించాలని సూచించారు. సమతుల్య ఆహారం ఆరోగ్యకర జీవితానికి మౌలిక ఆధారమని వివరించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్‌పై నిర్వహించిన సమీక్షలో తక్కువ పనితీరు చూపిన ఏఏఎం కేంద్రాలకు స్క్రీనింగ్ వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా లక్ష్యాలు తప్పనిసరిగా సాధించాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక నష్టాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. వి.హెచ్.ఎన్.డిలు, హెచ్.బి.ఏ.ఎన్.సి, హెచ్‌బివైసి సందర్శనలు, హెల్త్ మేళాలు, జె.ఏ.ఎస్ సమావేశాలు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న ఎస్.ఏ.ఎం, ఎం.ఏ.ఎం పిల్లలను ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లతో సమన్వయం చేసి గుర్తించి తగిన సేవలు అందించాలని ఆదేశించారు. భద్రాచలం డివిజన్ సమావేశంలో వెల్‌నెస్ కార్యకలాపాలు, హెల్త్ మేళాలు, జె.ఏ.ఎస్ కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని డిఎం అండ్ హెచ్.వో స్పష్టం చేశారు. ఏఏఎం కేంద్రాల వారీగా పనితీరును సమీక్షించి, లక్ష్యాలు సాధించని కేంద్రాలు నిర్దిష్ట గడువులో పనిని పూర్తి చేయాలని హెచ్చరించారు. డా. మధువరన్ (పివో-ఎన్.సి.డి) ఎన్‌సీడీ స్క్రీనింగ్ పురోగతిని సమీక్షిస్తూ, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు సమన్వయంతో స్క్రీనింగ్ నిర్వహించాలని సూచించారు. ఇంకా ఒక నెల సమయం ఉన్నందున లక్ష్య సాధన దిశగా వేగం పెంచాలని తెలిపారు. కుటుంబ సంక్షేమ కమిషనర్, తెలంగాణ, హైదరాబాద్ ఆదేశాల మేరకు పివో--సి.హెచ్.ఐ డా. తేజశ్రీ న్యూట్రిడే వేడుకలు, హెచ్‌బి.ఎన్.సి కార్యక్రమాలు, హెచ్‌బివైసి సందర్శనలు తప్పనిసరిగా నిర్వహించాలని సూచించా రు. ఎస్.ఏ.ఎం, ఎం.ఏ.ఎం పిల్లలను ఎం.ఎల్.హెచ్.పిలు, ఏఎన్ ఎంలు, ఆశాలు సంయుక్తంగా గుర్తించాలని తెలిపారు. కార్యక్ర మాల విజయవంతమైన అమలుకు ఐసిడిఎస్ విభాగంతో సమన్వ యం కీలకమని పేర్కొన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పాల్వంచలోని నెహ్రూ నగర్ ప్రభుత్వ ట్రైబల్ ఆశ్రమ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విద్య అందించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆహారాన్ని వృథా చేయకూడదని, మంచి అలవాట్లు ఆరోగ్యకర భవిష్యత్తుకు దారి తీస్తాయని వివరించారు. సుమన్--కె విధానంలో చేతులు కడుక్కోవడం ప్రదర్శించి వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్య తను వివరించారు. ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఉచితంగా క్రిమినాశక మాత్రలు అందిస్తుందని తెలిపారు. రక్తహీనత నివార ణకు ఆకుకూరలు, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్యాకెట్ ఫుడ్స్, రోడ్డు పక్క ఆహారం, శీతల పానీయాలు ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. మద్యం, ధూమపానం దుష్ప్రభావాలు, బాల్య వివాహాల నష్టాలు, చట్టబద్ధ వివాహ వయస్సు, బాల కార్మికత్వంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివాహానికి ముందు సికిల్ సెల్ అనీమియా పరీక్ష చేయించుకోవాలని, “ఈట్ రైట్ ఢ డ్రింక్ రైట్” పాటిస్తూ శుభ్రమైన నీటిని ఎక్కువగా తాగాలని సూచించారు. స్పార్ష్ కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ప్రమాణం చేయించారు. హాస్టల్ పరిసరాలు, ఆహార పదార్థాల నిల్వలను పరిశీలించి గాలి ఆడే ప్రదేశాల్లో ఆహారం నిల్వ చేయాలని, ఫంగస్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందికి ఆదేశించారు. సిక్ రూమ్‌ను సందర్శించి అనారోగ్యంతో ఉన్న విద్యార్థులతో మాట్లాడి అవసరమైన సూచనలు ఏఎన్ఎంకు అందించారు. ఈ కార్యక్ర మాల్లో డా. ప్రసాద్ (డిప్యూటీ డిఎం అండ్ హెచ్.వో కొత్తగూడెం), డా. ఆర్.పీ. చైతన్య (పివో-ఎం.హెచ్.ఎన్), డా. మధువరన్ (పివోఎన్.సి.డి), డా. తేజశ్రీ (పివో-సి.హెచ్.ఐ), పాఠశాల ప్రధానో పాధ్యాయులు భద్రు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ఎమ్ డబ్ల్యూఎస్ ఎస్ బి జిహెచ్ఎంసి మ్యానేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి వినతి



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 7 (నినాదం) :** నేరేడ్ మెట్ డివిజన్ పరిధిలోని రామ హోసింగ్ కాలనీ, సాయి కృష్ణ పేజ్ -2 కాలనీ లలో డ్రైనేజి ప్రాబ్లమ్ తో ప్రజలు ఎదు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం నేరేడ్ మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి స్థానిక కాలనీ వాసులతో కలిసి హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ ఢ ఎస్‌బి జీహెచ్ఎంసీ మ్యానేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ఐఏఎస్ ని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం ను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రిఫరెన్స్ లేఖ ఆధారంగా ఈ రెండు కాలనీలకు సంబంధించిన డ్రైనేజీ పనులకు తక్షణమే మంజూరు చేయాలని ప్రతిపాదన ఇవ్వడం జరిగిందని, నేరెడ్‌మెట్, యాప్రాల్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులు కొత్త ప్రతిపాదనలలో అత్యవసరమైన పనులకు కూడా అవసరమైన మంజూర్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొతపల్లి ఉపేందర్ రెడ్డి, బీజేపీ నేరేడ్ మెట్ డివిజన్ అధ్యక్షులు ఆదిత్య, శ్యామ్, అకారం సాయి, సునంద, సతీష్, జయప్రకాశ్, శుభ మీనన్, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వైద్య శాఖ సంయుక్త దాడులు ఇద్దరు నకిలీ డాక్టర్ల అరెస్ట్

**అల్వాల్, ఫిబ్రవరి7 (నినాదం):** ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ, ఎటువంటి వైద్య అర్హత లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తున్న నకిలీ డాక్టర్లపై ఆల్వాల్ పోలీసులు మరియు వైద్య శాఖ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి భారీగా వైద్య పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆల్వాల్ సబ్-ఇన్స్పెక్టర్ టి. తరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాజిగూడ, పద్మావతి కాలనీలో కొందరు వ్యక్తులు అక్రమంగా మెడికల్ ప్రాక్టీస్ చేస్తున్నారని పోలీసులకు మరియు ఆల్వాల్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు సమాచారం అందింది. ఈ మేరకు మల్కాజ్గిరి జోన్ పోలీసు యంత్రాంగం మరియు వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ఒక ప్రత్యేక బృందం ఏర్పడింది. ఈ బృందంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి. శ్రీకాంత్, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గాయత్రి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పద్మావతి కాలనీలోని ఈ కేంద్రంపై దాడి చేసినప్పుడు, దొంత యాత్రి మహ ఋషి (51) అనే వ్యక్తి రోగులకు అల్లోపతి చికిత్స అందిస్తూ పట్టుబడ్డాడు. డాక్టర్ శ్రీకాంత్ అతని సర్టిఫికేట్లను పరిశీలించగా, అతను కేవలం నర్సు అని, డాక్టరుగా చికిత్స చేయడానికి అతనికి ఎలాంటి అర్హత లేదని తేలింది. ఇతను గత కొంతకాలంగా ప్రజలను మోసం చేస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నాడు. నాని ఫస్ట్ ఎయిడ్ సెంటర్: అదే ప్రాంతంలోని మరో కేంద్రంపై దాడి చేయగా, రాయిశెట్టి వెంకటేష్ (32) అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఇతను ఎం.ఎల్.టి పూర్తి చేసి, ల్యాబ్ టెక్నీషియన్ గా పనిచేయాల్సింది పోయి, డాక్టరుగా అవతారమెత్తి ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. వారి నుండిస్వాధీనం చేసుకున్న వస్తువులు: నిందితుల వద్ద నుండి స్టెతస్కోప్‌లు, బి.పి. మెషిన్లు, పల్స్ మీటర్లు, థర్మామీటర్లు, హానికరమైన అల్లోపతి ఇంజెక్షన్లు ప్రిస్క్రిప్షన్ బుక్కులను అధికారులు సీజ్ చేశారు. చట్టపరమైన చర్యలు: నిందితులు ఇద్దరూ ఎంబిబిఎస్అర్హత లేకుండా వైద్యం చేస్తూ, అల్లోపతి మందులు ఇస్తూ ప్రజారోగ్యానికి ముప్పు కలిగిస్తున్నందున, వారిపై భారతీయ న్యాయ సంహిత బి.ఎన్.ఎస్ సెక్షన్లు 318, 319, నేషనల్ మెడికల్ కమిషన్ యాక్ట్ 2019, మరియు తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ యాక్ట్ 1968 కింద కేసులు నమోదు దర్యాప్తు పోలీసులు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ. పోలీసు శాఖ సంయుక్తంగా మాట్లాడుతూ ప్రజలు ఇటువంటి అర్హత లేని వ్యక్తుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఎల్లప్పుడూ గుర్తింపు పొందిన వైద్యులను మాత్రమే సంప్రదించాలని కోరారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని వారు హెచ్చరించారు.

ఆదివారం, తెలంగాణ
08 ఫిబ్రవరి 2026
# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

## నేటి నుంచి మిర్యాలగూడలో డాక్టర్స్ క్రికెట్ ప్రీమియర్ లీగ్

### డాక్టర్ శేఖర్ రెడ్డి



**మిర్యాలగూడ ఫిబ్రవరి 7 (నినాదం) :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఈ నెల 8వ తేదీ నుంచి డాక్టర్స్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ సీజన్ 8 టోర్నమెంట్ ప్రారంభం కానున్నాయని డాక్టర్ శేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని విద్యానగర్ డాక్టర్స్ క్రికెట్ టోర్నమెంట్ క్లియో స్పోర్ట్స్ అరెనా లో నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ 8 వ సీజన్ ను మిర్యాలగూడ కింగ్స్ లేవన్ టీమ్ ఆర్గనైజింగ్ లో టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 6 టీమ్ లు పాల్గొంటారని, మిర్యాలగూడ కింగ్స్ లేవన్, కోదాడ రాయల్స్, నల్గొండ ఛాంపియన్స్, సూర్యాపేట సనరైజర్స్, దేవరకొండ డ్రీమ్ చేసర్స్ నకిరేకల్ అటాకర్స్ టీంలు పాల్గొంటాయని తెలిపారు.ప్రతి సంవత్సరం రొటీన్ లైఫ్ కి భిన్నంగా ఆట విడుపు లో భాగంగా డాక్టర్స్ ఈ టోర్నమెంట్ పాల్గొనున్నారని డాక్టర్ శేఖర్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన



**చింతపల్లి ఫిబ్రవరి 7(నినాదం):** విద్యా బుద్ధులు నేర్పించి, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఒక ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన మండలంలోని వి. టి. నగర్ లో శనివారం చోటుచేసుకుంది. మండలం పరిధిలోని వీటి నగర్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు దేహశుద్ధి చేశారు.ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు దేవ్లా ఒక విద్యార్థిని అసభ్యంగా ప్రవర్తించడంతో విషయాన్ని బాలిక తన తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన తల్లిదండ్రులు వెంటనే పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. అనంతరం క్లాస్ రూమ్ నుంచి టీచర్ దేవ్లాను బయటకు లాక్కొచ్చి చితకబాదారు. అనంతరం అతన్ని పోలీసులకు అప్పగించారు.ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా విద్యా శాఖ అధికారి ఆదేశాల మేరకు జరిగిన సంఘటన పట్ల పూర్తి నీవేదికను సమర్పించగా వెంటనే స్పందించిన అధికారులు సదరు ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారని మండల విద్యాధికారి నీరుడు అంజయ్య తెలిపారు. ఘటనపై ఎటువంటి పిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## డబ్బుల పంపిణీ చిత్రీకరణపై

# జర్నలిస్టులపై దాడి!


### కోదాడలో జర్నలిస్టుల శాంతియుత నిరసన, డీఎస్పీకి మెమోరాండం



**కోదాడ, ఫిబ్రవరి 7 (నినాదం):** కోదాడ మున్సిపాలిటీ పరిధిలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటర్లను కొనుగోలు చేసేందుకు డబ్బులు పంపిణీ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీ నగర్, ఏడవ వార్డులో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని సమాచారం అందింది. ఈ ఘటనను వీడియో రూపంలో చిత్రీకరిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు శ్రీకాంత్, సురేష్‌లపై కాంగ్రెస్ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తూ కోదాడ జర్నలిస్టులు ప్రధాన రహదారిపై శాంతియుతంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.అనంతరం డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణలకు మెమోరాండం సమర్పించి, దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకొని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో మీడియాపై దాడులు సహించరాదని, జర్నలిస్టుల భద్రతను ప్రభుత్వం తక్షణమే నిర్ధారించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఘటనపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాస్తవాలను పరిగణనలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి-అభివృద్ధికి పట్టం కట్టండి..

### మంత్రులు తుమ్మల,పొన్నం,నవీన్, ప్రణవ్





**జమ్మికుంట ఫిబ్రవరి 7 (నినాదం):** హుజూరాబాద్,జమ్మికుంట మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తున్నాం.. కాంగ్రెస్ అభివృద్ధి సంక్షేమ పథకాలకు జనం పట్టం కడతారు. జూబ్లిహిల్స్ తీర్పే మున్సిపల్ లో రిపీట్ కాబోతుంది. హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.. హుజూరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,హుజూరాబాద్ జమ్మికుంట మున్సిపల్ ఎన్నికల్లో మంచి మెజారిటీతో విజయం సాధించబోతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శనివారం రోజున హుజూరాబాద్ పట్టణంలోని డిసిఎంఎస్ కాంప్లెక్స్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కార్నర్ మీటింగ్ లో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోపే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్ సౌకర్యాన్ని,గృహలక్ష్మీ పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్,కలలు నిజం చేసే ఇందిరమ్మ ఇళ్లు,పేదల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వంగా పేదలకు ఉచిత సన్న బియ్యాన్ని అందజేశామని ఇలాంటి సంక్షేమ పథకాలతో దేశంలోనే సంక్షేమ పథకాలను అమలులో ఆదర్శంగా నిలిచామని,ఇలాంటి పని చేసే ప్రభుత్వాన్ని ప్రజలు రాష్ట్రం అంతటా అన్ని ఎన్నికల్లో ఆదరిస్తున్నారని అన్నారు.రాబోయే కాలంలో హుజూరాబాద్,జమ్మికుంట మున్సిపల్ లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తే మరిన్ని నిధులు ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని,మిగిలిందల్లా అభ్యర్థుల గెలుపే మిగిలిందని అన్నారు.నియోజకవర్గ ఇంచార్జిగా ప్రణవ్ మంచి పనులు చేస్తున్నాడని,ఇక్కడి ఎమ్మెల్యే చిల్లర వేషాలతో హుజూరాబాద్ అభివృద్ధికి విరోధకుడిగా నిలుస్తున్నాడని అన్నారు.గతంలో ఎంపీ గా ఈ ప్రాంతానికి సేవ చేసిన వ్యక్తిగా ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.రాబోయే 3 ఏళ్లలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ నుండి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల పట్ల శ్రద్ధ వహించాలి




**చింతపల్లి, ఫిబ్రవరి 7 (నినాదం):** అంగన్వాడి కేంద్రాలకు వస్తున్న చిన్నారుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని గొడకొండ్ల గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య సూచించారు.మండలంలోని గొడకొండ్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. అనంతరం చిన్నారుల చేత ఉపసర్పంచ్ ఎండి ఖలీల్ బేగ్ తో కలిసి అక్షరాలు దిద్దించారు. సూపర్వైజర్ సుగుణ మాట్లాడుతూ సి డి పి ఓ.సక్కుభాయి ఆదేశాల మేరకు గ్రామ బాలల పరిరక్షణ కమిటీ, ఎ. ఎల్. ఎం. ఎస్. సి.కమిటీ సమావేశాలతో పాటు సుపోష దివస్, అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, తదితర కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు బాలల హక్కులు, లింగ వివక్షత, బాల్య వివాహాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ పద్మా, ఎ ఎన్ ఎం. సరిత, అంగన్వాడి ఉపాధ్యాయులు యాదమ్మ, పారిజాత,లీలావతి, ప్రభావతి, స్వప్న, హెల్పర్ బక్కమ్మ, ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రమాభాయ్ అంబేద్కర్ జయంతి వేడుకలు



**చింతపల్లి, ఫిబ్రవరి 7 (నినాదం):** మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రమాభాయ్ అంబేద్కర్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు భావండ్లపల్లి చెన్నయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎర్ర జగన్, మాజీ ఎంపిటిసి ఎలిమినేటి నరసింహ, ఎర్ర రాకేష్, కురుమేటి కృష్ణయ్య, ప్రమీల, ఆగిరి రవీందర్,బొలి సాని సత్యనారాయణ, కదారి అంజయ్య, మొగిలి మోని జంగయ్య, పోలే సైదులు, నల్ల ప్రసాద్, అక్బర్, కురుమేటి మల్లయ్య, చోటూ,మాధవి, మంజుల, యాదమ్మ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## హైదరాబాద్‌లో "సెకెండ్ తెలంగాణ సీడ్ ఫెస్టివల్"



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 7 (నినాదం):** రంగారెడ్డి జిల్లా కడ్తల్ మండలం అన్మాసుపల్లి గ్రామంలో తేది 06-02-2026 నుండి 08-02-2026 వరకు నిర్వహిస్తున్న "సెకెండ్ తెలంగాణ సీడు ఫెస్టివల్" ఘనంగా కొనసాగుతోంది. ఈ ఫెస్టివల్‌లో స్థానిక మరియు సాంప్రదాయ విత్తనాల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా విత్తన పరిరక్షణ, సహజ వ్యవసాయం, వ్యవసాయ జీవవైవిధ్య పరిరక్షణ అంశాలపై నిపుణులచే ప్రత్యేక వర్క్‌షాప్‌లు, ప్రసంగాలు నిర్వహిస్తున్నారు. రైతులు తమ పాత విత్తనాలను మార్పిడి చేసుకోవడంతో పాటు, సంప్రదాయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించుకుంటున్నారు. తేది 07-02-2026 రోజున ఈ కార్యక్రమంలో ములుకనూరు సహకార సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డితో పాటు సంఘానికి చెందిన వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, స్థానిక విత్తనాల పరిరక్షణ ద్వారానే వ్యవసాయ స్వావలంబన సాధ్యమవుతుందని, సహజ వ్యవసాయం రైతులకు తక్కువ ఖర్చుతో స్థిరమైన ఆదాయం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ ఫెస్టివల్ ద్వారా రైతుల్లో విత్తన భద్రతపై చైతన్యం పెరిగి, భవిష్యత్ తరాలకు సంప్రదాయ విత్తనాలను కాపాడాల్సిన అవసరాన్ని తెలియజేస్తోందని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి రైతులు, వ్యవసాయ నిపుణులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు.



## గిరిజన వ్యక్తి వీరన్నపై దాడి చేయలేదు..

### ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 07(నినాదం):** మరిపెడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు..రెండో వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా టికెట్ కేటాయించి బీఫామ్ ఇవ్వాలని నరేష్,రాంబాబు అన్నదమ్ములు వార్డ్ పెద్దమనుషుల సమీక్షంలో టికెట్ కావాలని అడిగినప్పుడు పార్టీ కోసం కష్టపడ్డ అనిత రాంబాబుకి ఇవ్వడం జరుగుతుందని,రాజకీయ భవిష్యత్తు ఉంది కావున ఇతర అవకాశాలు ఉంటే చూస్తానని మర్యాదపూర్వకంగా మాత్రమే చెప్పడం జరిగిందని ఎవరిపై చేసుకోలేదన్నారు.కేవలం రాజకీయ కక్షపూరితంగానే విమర్శలు చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి,పట్టణ అధ్యక్షులు తాజుద్దీన్, జిల్లా కార్యదర్శి గుగులోతు రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు అభినవ్ రెడ్డి,రెండో వార్డ్ కాంగ్రెస్ నాయకులు ఛత్రు నాయక్,కాంగ్రెస్ మండల నాయకులు, సర్పంచులు,వార్డ్ మెంబర్లు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలకు విలువ లేదా మేము చేసిన తప్పేమిటి సారూ..!





### తహశీల్దార్ వద్ద గోడు

### వెలిబుచ్చిన బాధిత రైతులు..!

**పాలేరు ఫిబ్రవరి 07( నినాదం):** ప్రజలు,పశువుల ప్రాణాలకు విలువ లేకుండా,పోతుందని. బాధిత రైతులు అధికారుల ఎదుట వాపోయారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని,అప్పలనరసింహాపురం లో స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ వలన పరిసర ప్రాంతాలలో ఉన్న వివిధ పంటలు దెబ్బతింటున్నాయని. బాధిత రైతులు ఇటీవల గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నివేదికను,అందించాలని జిల్లా కలెక్టర్ స్థానిక తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు ను ఆదేశిచాంచారు. ఈ మేరకు శనివారం క్షేత్ర స్థాయిలో మిర్చి తోటలను 'పరిశీలించారు. రైతుల నుంచి సమస్యను అడిగి తెలుసుకునానరు.ఈ,సందర్భంగా రైతులు వారి గోడు ను వినిపించారు. ఫ్యాక్టరీ వలన వచ్చే పొగ, దుమ్ము, కాలుష్యం వలన పంటలు దెబ్బతింటున్నాయని... భూస్వారం తగ్గి పంటలు దిగుబడి తగ్గుతుందని వాపోయారు. పరిసర ప్రాంతాలలో మంచినీటి కుంటలు అంతా రంగు మారిన నీటిని తాగిన పశువులు, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నామని అగ్రహాం వ్యక్తం చేశారు. పశువులు, ప్రజలు ప్రాణాలకు విలువ లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఏ తప్పు చేశాం సారూ.మాకు ఎందుకు ఇంత నష్టం.మీరే ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, జీపీవో షేక్ జానిమియా పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికలకు ఫిబ్రవరి 11న సెలవు

### జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి వెల్లడి



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 7 (నినాదం):** వనపర్తి జిల్లాలోని మున్సిపాలిటీలకు జరగనున్న రెండో సాధారణ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ రోజైన ఫిబ్రవరి 11 న స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఈ నెల11తేదీన మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో ఈ స్థానిక సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు జరగనున్న వనపర్తి జిల్లాలోని వనపర్తి, కొత్తకోట, పెబ్బేరు, ఆత్మకూరు, అమరచింత 5 మున్సిపాలిటీల పరిధిలో ఈ సెలవు వర్తిస్తుందన్నారు. పోలింగ్ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలకు (పాఠశాలలు, కళాశాలలు) సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఎటువంటి ఆటంకం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.